# జ్ఞానామృతం



రాజయోగిని హృదయమోహిని దాదీజీ
ప్రథమ అవ్యక్త స్మృతి దివసం (మార్చ్ 11)










**1.జగ్గన్నపేట(తూ॥గో):** మహాశివరాత్రి వేడుకలలో బి.కె.రజనిబెహన్‌జీ, బి.కె.దిల్‌రెడ్డిగారు, బి.కె.లక్ష్మీనారాయణగారు. **2.బోయిన్‌పల్లి(సికింద్రాబాద్):** మహాశివరాత్రి వేడుకలలో పాల్గొన్న కార్పొరేటర్ ముద్దంనర్సింహయాదవ్‌గారు, సతీష్‌గారు(బ్రిలియంట్‌స్కూల్ మేనేజింగ్‌డైరెక్టర్), యుగెంధర్‌గారు(ఎస్ఐ), జిఎస్.యాదవరావుగారు(జనరల్‌సెక్రెటరి తెలంగాణ ఎస్సి,ఎస్టి అండ్ ఐబిసి వెల్ఫేర్ అసోసియేషన్), వేదికపై బి.కె.సరోజబెహన్‌జీ, బి.కె.ఉమగారు. **3.సీతాఫల్‌మండి(సికింద్రాబాద్):** మహాశివరాత్రి వేడుకలలో కేక్‌కట్‌చేస్తూ వీరమాచనేని స్కూల్ ప్రిన్స్‌పల్ రమేశ్‌బాబుగారు, బి.కె.సరోజబెహన్‌జీ, బి.కె.నిర్మలగారు, బి.కె.జయగారు. **4.అమలాపురం:** మహాశివరాత్రి వేడుకలలో పాల్గొన్న మున్సిపల్‌కమీషనర్ వి.అయ్యప్పనాయుడుగారు, ప్రిన్సిపల్ జూనియర్‌సివిల్‌కోర్ట్‌జడ్జ్ శ్రీలక్ష్మీగారు, బి.కె.శ్రీదేవిగారు. (ఇన్‌సెట్‌లో 108శివలింగాలదివ్యదర్శనం). **5.రాంనగర్(సికింద్రాబాద్):** మహాశివరాత్రి వేడుకలలో ఎమ్మెల్యే ముఠాగోపాల్‌గారికి పుష్పగుచ్ఛాన్నిస్తూ బి.కె.సరోజ బెహన్‌జీ, బి.కె.శ్రీలతగారు. **6.పత్తికొండ(కర్నూలు):** 'స్నేహమిలనం' కార్యక్రమంలో మాజీసర్పంచ్ సోమశేఖర్‌గారు, వాసవిమహిళామండలి ప్రెసిడెంట్ మమతగారు, బి.కె.శ్రీలక్ష్మీగారు, తదితరులు. **7.శంకరాపురం(కడప):** 18జనవరి స్మృతిదివసం సందర్భంగా శాంతిస్తంభంముందు నివాళులు అర్పిస్తూ పవన్‌కుమార్‌గారు, పంచాయతీరాజ్ ఏ.ఇ. సురేశ్‌కుమార్‌గారు, పోస్టల్‌డిపార్ట్‌మెంట్ ఇంచార్జ్ శివగోపాలక్రిష్ణగారు, బి.కె.ఈశ్వరిగారు, తదితరులు. **8.డైమండ్‌పాయింట్(సికింద్రాబాద్):** మహాశివరాత్రి వేడుకలలో పాల్గొన్న సుభాష్‌అగర్వాల్‌జీ, బూరుగుసంతోషగారు, బి.కె.సరోజబెహన్‌జీ, బి.కె.బబితగారు, బి.కె.జగదీష్‌గారు.



పాఠక మహాశయులకు

## మహిళాదినోత్సవం శుభాకాంక్షలు

- ప్రధాన సంపాదకులు


# GYANAMRUTHAM

TELUGU MONTHLY MAGAZINE

VOL.17 ISSUE 12 MARCH 2022


## జ్ఞానసూచిక


- సంపాదకీయం
  శీలాధ్యయనము ... 4
- బాబాస్నేహం ... 6
- సంజయుని కలం:
  తపస్వీజీవితం ... 8
- జ్ఞానపదులు ... 10
- అలౌకిక అనుభవం ... 11
- అంతరంగం శీర్షిక:
  దృక్పథం ... 13
- తపస్సు ... 15
- ధృడమైన సిద్ధాంతం ... 17
- అలౌకిక అనుభవం ... 18
- విజయమాలకై పరీక్ష ... 20
- నింద ... 22
- అంతరంగం శీర్షిక:
  దృష్టాంతము ... 24
- కథామృతం:
  వ్యర్థం ... 25
- అలౌకిక అనుభవం ... 26
- ఆత్మహత్య సమస్యకు... ... 29
- సంకీర్ణశక్తి ... 32
- చాణక్యనీతి ... 34



"GYANAMRUTHAM" Telugu Monthly Magazine

Editor : **Rajyogini B.K. Saroja**

**PRAJAPITA BRAHMA KUMARIS ISHWARIYA VISHWAVIDYALAYA**

H.Q.: Mount Abu, Rajasthan, India

**B.O. :** # 7-1-406, Monda Market, Secunderabad - 500 003.

Phone : 040-2771 2444 E-mail : **mondabk@gmail.com**


**గమనిక:**

చందాదారులుగా చేరదలచుకున్నవారు తమ **చందాలను** **యం.ఓ. / డి.డి. / నగదు** ద్వారా **"GYANAMRUTHAM"** పేరిట మాత్రమే పంపగలరని మనవి.

**సంవత్సర చందా : రూ.100/-మాత్రమే**


ప్రధాన సంపాదకులు : **బి.కె. సరోజ బెహన్**

సహ సంపాదకులు: **బి.కె. ప్రేమ్‌కుమార్**

సంపాదకీయం

## శీలాధ్యయనము

**మా**నవజీవితంలో అధ్యయనం అనేది ఎంతో విశిష్టమైన విషయం. అధ్యయనము అనగా పరిశీలన. ఇందులో ప్రతివిషయంలోను మన స్వభావాన్ని సరిదిద్దుకుని అభివృద్ధి చెందేందుకు సూక్ష్మమైన మార్గాలు కనిపిస్తాయి.అంతేగాకఇతరులనడవడికనుపరిశీలించి నడుచుకోగలం. అలాగని ప్రతికూలభావంతో శీలపరిశీలన చెయ్యడం మంచిది కాదు సరికదా తద్వారా ప్రమాదకరమైన ఫలితాలు కలుగుతాయి. ఇతరుల తప్పలను వెతుకుతూ వాటిని బయలుపరిచే స్వభావమున్న వ్యక్తిని ఎవరు దరిచేరనీయరు. ఇతరుల తప్పలను బుద్ధిలోవుంచుకొని ఆనందించేవారు తమను ఎవరైనా విమర్శిస్తే భరించలేరు.

ఇంతకూ మనం ఏమి పరిశీలించాలి? ఇతరులలోని సద్గుణాలను నిరంతరం గమనిస్తూ వాటిని మనమనసులో పాదుగొలిపే గట్టి ప్రయత్నం నిరంతరం చేయాలి. శీలాన్ని(నడవడిని)అధ్యయనం చేయడంలోగల ముఖ్యోద్దేశ్యం తెలిసివుండాలి ఎవరితో కలిసి పని చేయాలో వారిస్వభావాన్ని మనంపరిశీలిస్తాము. వారిని ఎన్ను కోవడంలో మనదృక్పథం విభిన్నంగా వుంటుంది. ఒక్కొక్కసారి చెడ్డ వాడని తెలిసిన వ్యక్తిని కూడ చేరదీసి మారతాడేమోనని చూస్తాము.

అతని మంచిని కోరే ఆధ్యాత్మిక శుభభావనకు అతడు ప్రతిస్పందిస్తే మంచి మార్పుకూడ రావచ్చు. సేవాభావంగల వైద్యునివలె రోగికి చికిత్స చేసి ఒకోసారి ప్రమాదాన్ని కూడా ఎదుర్కోవలసివుంటుంది. ప్రతి ఒక్కరికీ తమ తప్పలను సరిదిద్దుకునే అవకాశం కలిపించాలి.

మనను ఇతరులువిమర్శించకుండా వుండాలంటే మనం ఇతరు లను విమర్శించవద్దు.కేవలం ఇతరులను బాధించే విమర్శలు పనికి రావుకాని సద్విమర్శలు పనిచేస్తాయి.అవికూడ నిజమైనప్రేమతో ఎదుటి వ్యక్తి కోరుకున్నపుడు చేసేవిమర్శలకే విలువవుంటుంది. ఆత్మ నిగ్రహం సాధించిన వారికే ఇతరులకు సహాయంచేసే అధికారం వుంటుంది.

కొందరు స్వరూపాన్నిబట్టి స్వభావాన్ని అంచనావేస్తారు. శరీర లక్షణా లన్నీ నిజస్వభావాన్ని వ్యక్తం చేయలేవు. మనం ఏమితిన్నా ఆ ఆలోచనా విధానమే శరీరంలోవ్యక్తమౌతుంది.మనసు అనేకజన్మలలో ఆలోచించిన ఆలోచనలన్నింటి ప్రభావం శరీరం మీద కనిపిస్తుందనే సత్యాన్ని దృష్టిలో వుంచుకొనిచూస్తే శరీరలక్షణాలు స్వభావాన్ని వ్యక్తం చేస్తాయనేది సత్యమే. కాని వీటికి సరియైనఅర్థం చెప్పడం గొప్ప మహాత్ముల అంతర్దృష్టికే సాధ్యమవుతుంది.

ఉదా :- సోక్రటీసు చాలా అందవికారంగా ఉండేవారు. అతనికి ఒక జ్యోతిష్కుడు నీవు దుర్మార్గుడవని చెపితే అతని శిష్యులకు చాలా కోపం వచ్చింది. అపుడు సోక్రటీసు నీవు చెప్పిందినిజమే,నేను పూర్వంఅలాగే



ఇతరులలోని
సద్గుణాలను నిరంతరం
గమనిస్తూ వాటిని మన మనసులో
పాదుగొలిపే గట్టి ప్రయత్నం
నిరంతరం చేయాలి.
శీలాన్ని(నడవడిని)అధ్యయనం
చేయడంలోగల ముఖ్యోద్దేశ్యం
తెలిసివుండాలి
కొందరు స్వరూపాన్నిబట్టి
స్వభావాన్ని అంచనావేస్తారు.
శరీర లక్షణాలన్నీ
నిజస్వభావాన్ని వ్యక్తం చేయలేవు.
మనం ఏమితిన్నా
ఆ ఆలోచనా విధానమే
శరీరంలోవ్యక్తమౌతుంది.
శీలాన్నిఅధ్యయనం చేయాలంటే
అత్యున్నత మార్గం
రాజయోగం.



వుండే వాడిని, వివేకంతో ఆ స్వభావాన్ని జయించాను కాని అపుడు చేసిన చెడుకర్మలన్నీ ఈ శరీరంలో వ్యక్తమై నన్నుఅందవిహీనంగా చేశాయని సమాధానం ఇచ్చాడట. ఈ జన్మలోను, పూర్వజన్మల లోను వ్యక్తమైన లక్షణాలననుసరించి ఒక్కొక్కరి ముఖం ఒక్కొక్క విధంగా వుంటుంది. అలాంటపుడు ఒక్కవ్యక్తి స్వరూపం అందమైనదా, వికారంగా ఉందా అనేదానిపైన వారి మంచిచెడు స్వభావాలను నిర్ణయించలేము. కాని వ్యక్తికి ముఖ్యంగా ఉండ వలసింది ఆధ్యాత్మికసౌందర్యమని గ్రహించాలి.

అందువలన మనిషి భౌతికరూపంకంటె అతని భావాలనుబట్టి స్వభావాన్ని అంచనావేయడం కచ్ఛితమైన విధానం లేక విశ్లేషణ. భారతదేశంలో సంగీతానికి భగవంతునిపట్ల భావన కేంద్రబిందువై భావోద్రేకాన్ని శాంతింపజేసి గొప్ప ఆధ్యాత్మిక ప్రశాంతతను చేకూరుస్తుంది. విషయాన్ని సమగ్రంగా ఆలోచించేవారు ఆలోచనాపరులు, ఏపనినైనా వెంటనే చేయాలనుకునేవారు క్రియాశీలురు. వీరి శక్తులను ఆధ్యాత్మికంగా సత్ఫలితాలనిచ్చే కార్యంలో వినియోగించేలాశిక్షణనివ్వాలి. బాగా పనిచేసేవారికి యోగంపైన, ఎక్కువఆలోచించేవారికి బాగాపని చేయాలని సమతుల్యతను నేర్పాలి. సమబుద్ధి అనగా బుద్ధిస్థిరత్వం వున్నవారే భగవంతుని కనుక్కోగలరని శంకరాచార్యులంటారు.

స్థితప్రజ్ఞత్వమనే పూజావేదికపై విశ్వాధినేతయైన పరమాత్మ కూర్చుంటాడట. అలాంటిసమబుద్ధి వలన మానవుడు పరిపూర్ణశాంతిని అనుభవించగలడు. భగవంతుని దృష్టిలో. స్త్రీపురుషులిరువురూ ఆత్మ రూపంలో సమానులే. స్త్రీ భావోద్రేకంతో ప్రవర్తిస్తే పురుషుడు బుద్ధిననుసరించి ప్రవర్తిస్తాడు. ప్రతి ఒక్కరూ భావోద్రేకం, బుద్ధికి మధ్య సమతుల్యతను సాధిస్తే పరిపూర్ణవ్యక్తిత్వంతో మానవత్వాన్ని సాధించ గలరు. శీలాన్నిఅధ్యయనం చేయాలంటే అత్యున్నత మార్గం రాజయోగం. ఆత్మలో మనసు బుద్ధి పరిపూర్ణ ప్రశాంతతో వున్నపుడే మీ గురించిగాని, మీరు కలుసు కున్న వ్యక్తులస్వభావాన్ని మీలోని ఆంతరంగికంగా నిక్షిప్తమైన జ్ఞానంతో తెలుసుకోవచ్చు. మీరు ప్రశాంతంగా యోగయుక్తమై ఇతరుల మంచికి పాటుపడుతుంటే వారి స్వభావం మీకు స్పష్టంగా వెల్లడియవుతుంది.

**బి.కె. సరోజ**
ప్రధాన సంపాదకురాలు

## శతక రత్నావళి

**అనువుగానిచోట అధికులమనరాదు**
**కొంచెముండు టెల్ల కొదువకాదు**
**కొండ అద్దమందు కొంచమైవుండదా?**
**విశ్వదాభిరామ వినురవేమ !**

**భావము :** *అనువుగాని ప్రదేశంలో గొప్పవారమని చెప్పకోకూడదు. అక్కడ అణిగి వుండడం తప్పేమీ కాదు. కొండ అద్దంలో అతి చిన్నదిగా కనిపించనంత మాత్రాన ఆ కొండ గొప్పతనం తగ్గిపోతుందా? ఏమాత్రం తగ్గదు.*

ఓం శాంతి



# బాబా స్నేహం

● రాజయోగిని జానకి దాదీజీ.

శ్రీమతంతో హార్ట్, హ్యాండ్, హెడ్ అన్నీ సరిగ్గా పని చేస్తాయి.బాబాప్రేమ శ్రేష్టంగా, మధురంగా తయారు చేస్తుంది. శ్రేష్ఠంగా అంటే ఎలాంటి కోరికలు ఉండకూడదు. కోరిక ఉంటే అది పూర్తికాకపోతే ముఖకవళికలు మారిపోతాయి. అన్నింటికంటే మంచివిషయంమనం పరమాత్మ పిల్లలం.మనంఉన్నతంగాతయారు కావాలంటే ఎలాంటికోరికలు వుండకూడదు. సదా సంతృప్తిగా వుండాలి. ఇంట్లో ఆఫీస్‌లో, షాపులో ఈశ్వరీయ పరివారంలో అందరితో సంతృప్తిగా వుండాలి. ఎందుకంటే మనకు బాబానుండి అలౌకికఆనందం లభించింది. ప్రపంచంలో ఎవరూ ఇవ్వలేని ఈ అలౌకిక ఆనందంలోశక్తివుంది. ఈ శక్తి కర్మబంధనలతో విముక్తిచేసి ఒక్కబాబాతోనే వుండేలాచేస్తుంది.

బాబాకుసత్యం చెప్పి క్షమాపణ అడిగితే పాపఖాతా సగం తగ్గిపోతుంది. క్షమాపణ అడగకపోతే మళ్లీమళ్లీ పొరపాట్లు చేసేవారు శ్రీమతానుసారం నడవలేరు. శ్రీమతంలో నడవకపోతే హార్ట్, హ్యాండ్,హెడ్ సరిగ్గా పనిచేయవు. బాబాను ఫాలోచేసే లక్ష్యం వున్న వారికే అడుగడుగులో పుణ్య సంపాదన జమఅవుతుంది. మరి శ్రీమతానుసారంగా నడుస్తూ ట్రాఫిక్ కంట్రోల్‌ను పాటిస్తూ సదా బాబాస్మృతిలో వండిన భోజనమే తినాలి.సత్యతో,స్వచ్ఛతతోసింపుల్‌గా శాంపిల్‌గావుండాలి.అంతర్ముఖియై కర్మచేస్తూ ఏకాంతప్రియంగా ఒక్కడి స్మృతిలోనే వుండాలి.

ఏపనిచేసినా పవిత్రత,సత్యతతో చేయాలి. మాటల్లో, వ్యవహారంలో సత్యతవుండాలి. బాబాప్రేమ అపారమైన సుఖశాంతులను ఇస్తుంది. ఎక్కువ ఆలోచించే అలవాటుతో చాలాసమయం వ్యర్థమవుతుంది. నేనే చేయాలి, నేనే చేస్తున్నాను అనే భావనకు బదులు బాబానే చేసిచేయించేవారనిగుర్తుండాలి. ఆలోచనల్లో మన, ఇతరుల ఇష్టాలు మిక్స్ అయిపోతాయి. అందుకే శ్రీమతాన్ని దృష్టిలో వుంచుకొనినడిస్తే అలసట అనిపించదు.

పొరపాట్లుచేస్తే, ఇతరులు అవమానిస్తే మనసుకు అలసట అనిపిస్తుంది. ఈ అలసటకూడా మన ఆలోచనల పరిణామమే. సత్యం,అసత్యం, మంచి చెడుల గురించి బాబాస్పష్టంగా చెబుతున్నారు. బాబా పిల్లలమైన తర్వాత ఇవన్నీ అర్థంకాకపోతే ఇంకా వ్యర్థఆలోచనల్లో ఉన్నట్లే. తెలుసుకున్నవారు సత్యంగా వుంటారు. సత్యంగా వున్నవారు ఎవరెడీ, అల్‌రౌండర్, యాక్యురేట్‌గా వుంటారు. అసత్యంగా వున్నవారు 'నేను'అనేఅహంకారాన్నిచూపిస్తారు. వారు అనుకున్నదేదీ దొరక్కపోయినా వెంటనే కోపం వస్తుంది. చేసినదాన్ని సరిచేస్తే నచ్చదు. వారు చేయరు, వేరేవారికి చెబితే ఒప్పకోరు.

మనపైమనకు శ్రద్ధవుండాలి. బాబాభాష అందరికీ సుఖాన్నిచ్చే అలౌకిక భాష. మరి మన భాష సాధారణంగా లౌకికంగా ఉంటే ఎవరికీ సుఖాన్ని ఇవ్వలేదు. స్వయానికే సుఖం లభించనప్పుడు ఇతరులకు ఏమిస్తారు? అందుకే మనదగ్గర దుఃఖమనేది నామమాత్రంగాకూడా ఉండ

**చెప్పుకోండి చూద్దాం !**

**పచ్చని ఇంటిలో పదిరాళ్ళు**
**రాళ్ళపైన అరవది రవలు,**
**రవలన్నీ నలిగిపోతే**
**గుక్కెడునీరు గుటుక్కు**

సమాధానం ఇదే సంచికలో...

కూడదు. బాబా దుఃఖహర్త, సుఖకర్త,శాంతిదాత.మనల్నిమనం ఎవరమని ప్రశ్నించుకోవాలి.

మేము ఎలాంటి వారిమి? దుఃఖాన్నిచ్చేవారిమా? తీసుకునే వారిమా?అని ప్రశ్నించుకోవాలి. నేను బాబా సంతానాన్ని, బాబా నా దుఃఖాలను సమాప్తంచేసి నన్నుశాంతిప్రేమలతో సంపన్నంగా చేశారు.

బాబా స్నేహంతో మనలని సంపన్నమైన మూర్తులుగా చేస్తున్నారు. పిల్లలూ! మీరు నావాళ్ళు, నేను మీవాడిని, నా స్నేహంలో లీనమై ఉంటే లోపాలన్నీ తొలగి వికర్మలు వినాశనం అవుతాయని బాబాచెప్పారు. బాబాపై స్నేహంతో సత్యంగా తయారవుతాము. బాబా మన స్వచ్ఛత, సత్యతని చూసి నా పిల్లలు సత్యమైనవారు. పిల్లలంటే ఇలావుండాలిఅనేలా మన నడవడిక వుండాలి.

బాబాపేరునుప్రఖ్యాతిచేసేపిల్లల యొక్కపేరును బాబాకూడా ప్రఖ్యాతిచేస్తారు. దాదీలు బాబా స్నేహంలో సంపన్నంగాఅయినారు. బాబా స్నేహంలో సంపన్నమై అందరినీబాబాస్నేహంలోసంపన్నం చేయాలి.■



## సంబురాల సంకురాత్రి వేళ

కలగంటి నేనొక కలగంటి సంబురాల సంకురాత్రి వేళ
ఉత్తేజమైన ఉత్తమ సంగమయుగాన దర్శించితిని
బిందుస్వరూపుడైన పరమాత్మను చూచి పరవశించితిని
పుణ్యభూమి మన భారతావని పులకరించిపోయె
జ్ఞానజ్యోతుల ప్రకాశంలో మనధన్యభూమిన
బంగారు ఛాయ గోచరించె
సత్యయుగ స్థాపనయే సంగమమే సరియగు సమయమనియే
పాపాత్మలను పుణ్యాత్మలుగా మార్చుటే తన విధి అని నుడివెను
ముళ్ళ కంచెలను పూలవనాలుగా మార్చుటయే పరమానందమనెను
ఈ డ్రామారచనలో తానే దర్శకుడనియే
సర్వజనుల సౌభాగ్యమే తన ఆశయమనియే
వసుధైవకుటుంబ ఆలంబనమే ఆకాంక్షగా తన కర్తవ్యమనియె
ప్రతిఫలాక్ష ఆశించని పరమగురువే మన పరంపితపరమాత్మ
ఆత్మ పరమాత్మ తత్వముల వివరించె
ఆత్మ పరమాత్మల సంగమమే ఈ సంగమయుగ సారము తెలిపె
విచిత్రుడు ఆశరీరుడైన ఆ దయాసాగరుడు
శివబాబానే ధర్మసంస్థాపనార్థమై
బ్రహ్మాబాబా భాగ్య రథముపై బయలుదేరి
మన భారతావనికి అరుదెంచె
భారతమాత భాగ్యంను బంగరు ఛాయల
మెరిపింపచేసే ఆ శివుడు
పుణ్యభూమి మన భారతావనిన అబూపర్వతాన
ఆనంద పరవశాన మజిలీ చేసే
మనమెంత భాగ్యశాలురమో ఈ భూమిపైన

- బి.కె. కోటి, సీతాఫల్‌మండి, సికింద్రాబాద్.



మనకోరికిలు ఏ స్థాయిలో తగ్గిపోతే ఆ స్థాయిలో మనం భగవంతునికి దగ్గరవుతున్నామని *అర్థం.*

- రామకృష్ణ పరమహంస.

సంజయుని కలం నుండి

# తపస్యాజీవితం



తపస్వీ జీవితాన్ని ఎలా తయారుచేసుకోవాలి? అలాంటి జీవితం తయారు చేసుకోవాలంటే మనం తపస్వీ మూర్తులుగాకావాలి. కేవలం యోగంచేసే సమయం పెంచుకోవడమేకాదు జీవితాన్ని తపస్యామయంగా చేసుకోవాలి. బాబా సింపుల్ మరియు శాంపిల్‌గా ఉండాలంటారు. వ్యక్తిగతజీవితంకంటే పురుషార్థం సేవలపై చాలా శ్రద్ధవహించాలి.

మనజీవితం ఆదర్శంగాను, మనల్నిచూసి ఇతరులు నేర్చుకోవాలనిపించేలావుండాలి. మన మాట,దృష్టి,నడవడిక అన్నీ ఇతరులకంటే భిన్నంగా వుండాలి. అందరితోప్రేమగావుంటూఎలాంటి గొడవలు లేకుండా మనజీవితం ఇతరులకు ప్రేరణాదాయకమై ఆదర్శవంతంగా వుండాలి. బాబా పిల్లలైన మీరుచైతన్యమ్యూజియం అంటారు. అందువలన మనపైన మనకు చాలా శ్రద్ధవుండాలి.

జీవితాన్ని తపస్యామయంగా చేసుకోవాలంటే తొమ్మిది విషయాలపై శ్రద్ధ వహించాలి.

## అలౌకికత

మనంఏపనిచేసినా అందులో అలౌకికత్వం ఉండాలి. ప్రాపంచిక పనులైన, గృహస్థ వ్యవహారంలో అయినా సరే అలౌకికత ఉండాలి. బాబామనదృష్టి,భావన,వ్యవహారం అన్నీ మార్చేశారు. బాబా ఎలాంటి కోరికలు ఉండకూడదంటారు. ఒకవేళ వున్నాకూడా అలౌకికంగా వుండాలి. కోరికలతో ప్రపంచంలో సంఘర్షణ జరుగుతుంది కనుక స్థితి పాడవతుంది. అందుకే బాబా అంటారు పిల్లలూ! మీరు ఎలాంటి కోరికల్లేనివారిగా తయారుకండి అనిచెబుతారు. బాబా మనకు లభించారంటే అన్ని పొందినట్లేనని సంతోషంలో ఉండాలి.

## యోగాగ్ని

తక్కువలో తక్కువ నాలుగు గంటలు యోగంలో వుండాలని లక్ష్యం పెట్టుకోవాలి. మన యోగం అఖండంగావుండాలి. అంటే యోగాగ్ని ఎప్పుడూ ప్రజ్వరిల్లుతూ వుండాలి.

యోగం జ్వాలారూపంలో లేకపోవచ్చు కాని యోగాగ్ని వెలుగుతూనేవుండాలి. మనయోగం ఒకే విధంగా బాబాతో సంబంధం తెగిపోకుండా వుండాలి. కేవలం నాలుగు గంటలేయోగం మిగతా సమయమంతా ప్రాపంచిక విషయాలలో సమయాన్ని పోగొట్టుకోమనికాదు.మిగతాసమయంలో కూడా జ్ఞానమననం, స్వదర్శన చక్రం,మురళీచింతన విషయాల్లో బిజీగా వుండాలి. మనకు 'నేను మాస్టర్‌సర్వశక్తివంతమైనఆత్మను' తిరిగి పరంధామమైనఇంటికి వెళ్ళి మళ్ళీస్వర్గంలోరావాలనిగుర్తుండాలి. బాబావిషయాలుగుర్తుండుటయే యోగమనే అగ్ని వెలుగుతున్నట్లు అవుతుంది. లోహాన్ని కరిగించాలంటే అగ్నిచాలాతీవ్రంగావుండాలి. అలానే యోగాగ్నితో మన పాత అలవాట్లు సంస్కారాలు, వికర్మలు, పాపాలు అన్నీ భస్మమైపోవాలి. రోజూ ఏదోఒక సమయంలో తప్పకుండా యోగం చేయాలి.

## నిర్లక్ష్యం

జీవితంలో నిర్లక్ష్యమనేది చాలా పెద్దశత్రువు. దీనినిచిన్నదిగా భావించవద్దు. ఐదువికారాలు కూడా దీనితోనే వస్తాయి. ఈ నిర్లక్ష్యం పరమాత్మఆజ్ఞను కూడా ఉల్లంఘించేలాచేస్తుంది.పరమాత్మ ఆజ్ఞను ఉల్లంఘించేవారికి పరమాత్మతో సంబంధంజోడింపబడదు.ఈరోజు వర్షంపడతుంది చలిఉందని వాయిదాలు వేస్తూ నిర్లక్ష్యంతో ఈశ్వరీయ నియమాలను ఉల్లంఘించకూడదు. వాయిదాలు వేయడం వంటి నిర్లక్ష్యం జీవితంలో రాకూడదని ప్రతిజ్ఞచేసుకోవాలి.

## సోమరితనం

అమృతవేళ సోమరితనంవలన




**సత్యత స్వచ్ఛత సాధారణతల**
**మారుపేరు జానకిదాదీ**
**దివ్యత గంభీరత రమణీయతలకు నెలవైన మితవాది**
**చేస్తూ పలుమార్లు మురళీ పఠనం లోతైన అధ్యయనం**
**పొందారు ఆజ్ఞాపాలనతో బాబా హృదయ సింహాసనం**
**పరీక్షించి మీలో స్థిరచిత్తం అన్నారు శాస్త్రవేత్తలే చిత్తం**
**మిమ్ము చూసి విశ్వాత్మలు అయిపోయారు ధారాదత్తం**
**నడిచారు ముంబయిలో కిలోమీటర్లు ఖాళీపాదాలతో**
**తరించారు ఎందరో పూనాలో మీ అవిరామ సేవలతో**
**నిదురపోనివ్వరు మీ ఎదురుగా ఎవ్వరినీ, క్లాసు టైంలో**
**చూపుడువేలే నడిపించింది అందరినీ సరైన మార్గంలో**
**భయపడేవి అలసట, ఉదాసీనత రావడానికే మీ దరికి**
**మీ జాగరూకత నిర్భయత ఆదర్శం మానవులందరికి**
**బాప్‌దాదా ఒడిలో మీరు ఒదిగే తీరు మీ చిలిపి పనులు**
**పిల్లల హృదయాల్లో వేశాయి తీయని చెరగని ముద్రలు**
**అలుపెరుగక అనంతంగా సాగే మీ జ్ఞానామృత వాహిని**
**అనేక జీవన నావల్ని తీర్చిదిద్ది చేరేలా చేసింది తీరాన్ని**
**ఇతరుల సేవ సమయం ఆశించకూడదనే మీ గమనిక**
**నేర్పించి జీవించేకళ చేసింది అందరి జీవితాల్ని వేడుక**

**- బి.కె. గోపాల్, డోన్, కర్నూల్.**

యోగంలో కునుకుపాట్లు పడుతుంటారు. సోమరితనం కూడ తక్కువేమీకాదు.యోగంలో వున్నామంటే మాయతో యుద్ధంలో వున్నట్లే. సైనికులు సరిహద్దుల్లో వున్నప్పడు, శత్రువులతో యుద్ధం జరుగుతున్నపుడు నిద్రపోతే వారి పరిస్థితిఏమిటి?మనంయోగంలో బాబానుండి సర్వశక్తుల్ని తీసుకొని విశ్వానికి పంచతత్వాలకు అందించాలి. ఇది ఎంతపెద్ద బాధ్యత. మనం కునుకుపాట్లు పడుతుంటే ఎలా? జీవితంలో ఎప్పడూ సోమరితనాన్ని రానివ్వమని ప్రతిజ్ఞచేయాలి.

## అపవిత్రత

ఎలాంటి అపవిత్రత ఉండకూడదు.మొదట ఎంతగా మనం యోగంచేస్తే అంతగా జ్ఞానాన్ని ధారణచేయగలుగుతాము.అపుడు బుద్ధి బంగారంలాతయారై రత్నాలు నిండుతాయి. ఈ ప్రాపంచిక వ్యర్థమైనవిషయాలుబుద్ధిని అపవిత్రం చేస్తే ఈశ్వరీయజ్ఞానం బుద్ధిని పవిత్రంచేస్తుంది.

మొదటబుద్ధిని అపవిత్రంచేసే అంశాలు సంశయం, టివిలు, ఫోన్లు. రెండవది మానసిక అపవిత్రత.ఇందులో దృష్టిభావనకూడా వస్తాయి. మూడవది శారీరిక అపవిత్రత. నాల్గవది భోజనం. తామసిక బోజనానికి దూరంగా వుండాలి. ఐదవది అధ్యయనం మనసుభ్రమించేలాంటి పుస్తకాలు చదవకూడదు.ఆరవది సాంగత్యం, చెడుసాంగత్యంతో జాగ్రత్తగా వుండాలి. ఇన్నిరకాల అపవిత్రతలు వుంటే తపస్వీజీవితం ఎలా తయారవుతుంది.

## అహంకారం

అహంకారాన్ని రానివ్వకూడదు. కొన్నిసార్లు మనకు యోగం

కుదిరి మనసు మంచిగా ఏకాగ్రమవు తుంది.మనలో ఆ యోగశక్తివచ్చి మనం ఆనందంలో వుంటాము. లేనిచో అప్పుడు మనకు మనం నేను మహారథిని, మహాయోగిని అనే అహంకారం వచ్చేస్తుంది. ఇతరులకు ఏమి తెలియనట్లు మాట్లాడతాము. మనకు సిద్ధి లభించాయనుకుంటాము కాని ఆ ప్రాప్తులు సిద్ధులు బాబానుండి లభించినవేకదా!మనంవినయంతో వుండాలి. ప్రాప్తులన్నీ ఆయనిచ్చినవే అయినప్పుడుఅహంకారం దేనికి.

### ధైర్యము

ఎప్పుడూధైర్యాన్ని కోల్పోకూడదు కొన్నిసార్లు నెలలు తరబడి యోగం చేసిన తరువాతకూడా పాత అలవాట్లు సమాప్తం కాకపోతే నిరాశతో వదిలేస్తారు. అలా ఎప్పడూ చేయకూడదు. ధైర్యాన్ని కోల్పోకుండా ఉంటే బాబాతప్పక సహాయంచేస్తారు. ఆత్మవిశ్వాసాన్ని వదులుకోకూడదు.చేస్తూవెళ్తే ఏదో ఒకరోజు తప్పకుండా విజయం సిద్ధిస్తుంది. మనం పురుషార్థంచేస్తే అదెప్పడూ వ్యర్థంగాపోదు.ఫలితం లభిస్తుంది. అందుకే ఎప్పడూ నిరాశపడమని మనతోమనం ప్రతిజ్ఞచేసుకోవాలి. సర్వసమర్థుడు సద్గురువు నాతో వున్నారన్న విషయం మర్చిపోవద్దు బాబా ఎప్పడూ మనతోనే వుంటా నని ప్రతిజ్ఞచేశారు. అదితప్పకుండా పూర్తిచేస్తారు.

### అలవాట్లు

కొంతమంది అలవాట్లను మార్చుకుంటారు మరికొంత మంది మాఅలవాట్లు మారడం లేదంటారు. అలవాట్లు ఎందుకు మారడం లేదంటే మనం వాటిని వదలాలనే ప్రతిజ్ఞ చేయట్లేదు. మనస్ఫూర్తిగా వాటిని వదలాలని ప్రతిజ్ఞచేయండి. అప్పుడు మనం వాటిని వదలగలుగుతాము.

### ఉన్నతియందు శ్రద్ధ

మన ఉన్నతిపైన మనం శ్రద్ధ వహిస్తాం. ఫలానావారు జ్ఞానం లోవచ్చి చాలా సంవత్సరాలైంది. అయినా వారేమారలేదు నా చిన్న చిన్న లోపాలు ఏమంత పెద్ద విషయం అంటూ ఇతరులను వారెప్పడూ అమృతవేళ లేవరు నెనెప్పడైనా మిస్‌చేస్తే ఏముంది? ఇలా ఆలోచించడం చాలాతప్ప. మనఉన్నతి మనం చేసుకుంటా మని మనతో మనం ప్రతిజ్ఞ చేసు కోవాలిగాని ఎవ్వరిని చూడవద్దు.

మన ఆదర్శం బ్రహ్మాబాబా ఆయన్నేఫాలోచేయాలి. మనకంటే ఉన్నతమైన వ్యక్తుల్నే ఫాలోచేయాలి పడిపోయే వారిని చూసి మనం పడిపోవాలా? పడిపోయే వారిని రక్షించాలి.వారిని రక్షించ లేకపోతే మనం కనీసం జాగ్రత్తపడాలి. ఈ తొమ్మది రకాల ప్రతిజ్ఞలు చేసి నపుడే మనజీవితం తపస్యామయ మవుతుంది.■

## జ్ఞానపదులు

అనవసరపు ఆలోచనలతో -
ఆందోళన ఎందుకు .
అనువనువు ఆ పరమాత్ముని ప్రీతితో -
అడుగువేయి ముందుకు .
ఈర్ష్యాద్వేషాలతోనే -
అంతం కావాలా జీవితం .
ఈశ్వరుడు చెబుతున్నా -
అర్థంచేసుకోదా ఇంగితం .



- బి.కె. ప్రేమ్
మోండామార్కెట్, సికింద్రాబాద్.

# అలౌకిక అనుభవం



• రాజయోగిని చక్రధారి బెహన్‌జీ, ఢిల్లీ.

మేము జ్ఞానంలో వచ్చేనాటికి ఈ అలౌకికపూలతోట ఆది రత్నాలతో వికసించి వుంది. వారి దివ్యత, ఆత్మీయతనే ఈ తోటకు అందమైన అలంకరణ. దాదీలు అందరూ ఒకొక్కరు తమ సంపన్న స్థితిని చేరుకుని తమ తర్వాత పాత్రను అభినయించడానికి చాలా సంతోషంగా వెళ్ళిపోతున్నారు. వారు వెళ్ళడం అంటే రెడీగా వుండండి, స్థితిని తయారుచేసుకోమని సంకేతం.

కొత్తకొత్త పువ్వులు వికసిస్తాయి. పాత పూవులతో బాబా ఎన్నో కార్యాలు చేస్తారు. మనందరిలో అందమైన పుష్పం, పరమాత్మతో కలుసుకునే సౌభాగ్యాన్ని కలిగించే పుష్పంమనప్రియతమరాజయోగిని గుల్జార్‌దాదీజీ. మనందరి మధ్య నుండి సాకారరూపంలో అవ్యక్త వతనవాసి అయిపోయారు.

నేను ఈశ్వరీయ సేవల్ని ప్రారంభించి ఢిల్లీలోని కమలానగర్ సేవాకేంద్రంలోనికి వచ్చినపుడు గుల్జార్‌దాదీజీ, జగదీశ్‌భాయ్‌జీ, ఒకమాతాజీ, ఇద్దరు అన్నయ్యలు వుండేవారు. అక్కడ త్రిమూర్తి పుస్తకం తయారయ్యేది. జగదీశ్ భాయ్‌జీ మమ్మల్ని ఏదో సేవలో బిజీగా వుంచేవారు. నేను కోర్సు తీసుకొని మూడురోజులేఅయింది. నేను ఒకచిన్న బహుమతిని దాదీజీకి ఇవ్వడానికి వచ్చి హాల్లో నిలబడితే గుల్జార్‌దాదీజీ పిలిచి చాలా ప్రేమగా దగ్గరకు తీసుకుని భుజం మీదచేయివేసిమెల్లగా తన గదిలోకి తీసుకెళ్ళారు. అప్పడు దాదీజీ నాతో చక్రధారీ! ఈ సమయంలో నేను ఒంటరిగా వున్నాను. నువ్వు నాతోపాటు సేవకై ఉంటావా? అని అడిగారు.

నేను నా భాగ్యంగా మంచి అవకాశంలా భావించాను. ఇంట్లో బంధనాలగురించిఆలోచించలేదు. నేను తప్పకుండా వుంటానని చెప్పాను. నన్ను దాదీజీ ఎప్పడు వస్తావని అడిగారు. రేపే వస్తానని చెప్పాను. తరువాతరోజే మధ్యాహ్నం నేను సెంటర్‌కి వచ్చాను. దాదీజీ విశ్రాంతి తీసుకుంటున్నారు. దాదీ నా మంచంక్రింద ఒకచాపవుంది విశ్రాంతి తీసుకోమని చెప్పారు. లేచిన తరువాత బట్టలు ఎక్కడ పెట్టుకోవాలంటే దాదీజీ ఒక సిమెంట్ అలమారివుంది దానికి ఎలాంటి తలుపులు, కర్టెన్‌లు లేవు.

దాదీజీ తనుఈ మంచంమీద సేవార్థం పడుకుంటాను. ఒకవేళ నీకు నేలమీద నిద్రపట్టకపోతే మంచంపైన పడుకోవచ్చు అన్నారు. రోజూ ఉతికిన బట్టలన్నీ సరిగ్గా మడతపెట్టి మంచంక్రింద పెడితే ఉదయం లేచేవరకు మంచిగా ప్రెస్ అవుతాయి నీవు కూడా అలానే చేసుకోఅన్నారు.

నేనెప్పడూ లౌకిక అలౌకిక జీవితాన్ని పోల్చుకునేదాన్నికాదు. ఈ అలౌకిక జీవితమే సర్వశ్రేష్ఠ జీవితమనిపించేది. దాదీల త్యాగం తపస్యతోనే మా జీవితాలు తయారయ్యాయి. దాదీజీ అప్పడే నీకేది వస్తే అదిచెయ్యమని చెప్పారు. నాకైతే ఏమీ తెలియదు. దాదీజీ ఎప్పడూ మాటలతో ఏమీ చెప్పేవారుకాదు. తన కర్మలతోనే నేర్పించేవారు.

దాదీజీ జీవితాన్ని అందరికీ ప్రేరణాదాయకంగా బాబానుండి నేర్చుకున్న విషయాన్ని తమ జీవితంతో దారణచేసి తమ సంపర్కంలో వచ్చిన చిన్నచిన్న కన్యలకు తమ జీవితం ద్వారా ఎంతో నేర్పించేవారు. బాబా ఆ రోజుల్లో దీపావళి మొదలైన పండుగలు ఎలా చేసుకునేవారని అడుగుతారు. అప్పటికి ఇప్పటికీ ఎంతో తేడావుంది. ఇప్పడు లైట్లు అలంకరణలు అన్నీ చేస్తారు.

దీపావళికి గుల్జార్‌దాదీ సందేశంలో ఏవిధంగా శ్రీలక్ష్మీనారాయణులు సందేశీ తనువులో రావడం వారు ఎలానడుస్తారు ఎలా

**భగవద్గీత**




**జీవనసారం నేర్పిస్తుంది భగవద్గీత**
**కర్తవ్యం నిర్వహించు ఫలితం ఆశించకు అనే**
**కర్మసిద్ధాంతానికి ప్రతీకయే ఈ భగవద్గీతసారం**
**భావితరాలకు మార్గదర్శకం ఈ భగవద్గీత**
**భవబంధాలకు అతీతం ఈ భగవద్గీత**
**మంచి చెడుల యుద్ధమే కౌరవ పాండవులయుద్ధం**
**నీతి నియమావళి ప్రభోధమే ఈ భగవద్గీత**
**పునరపి జననం పునరపి మరణం ఈ భగవద్గీతబోధ**
**సృష్టి స్థితి లయకారకుడు ఈ గీతాజ్ఞానదాత**
**జన్మభూమి కర్మభూమి యోగ భూమి ఈ భారతావని**

**- బి.కె. ప్రసాదరాజు, భద్రాచలం.**


భుజిస్తారు అనేదృశ్యాలు గుల్జార్ దాదీజీరథంద్వారాబాబాచూపించే వారు. మేము ఆ సమయంలో అసలైనపండుగలుజరుపుకోవడం అంటే ఏమిటో అనుభవం చేసుకున్నాం. రాత్రి గడిచిపోయి పగలు ఎప్పుడయిందో తెలిసేదికాదు. ఈవిధంగా దివ్యమైన అలౌకికమైన పరంపితపరమాత్మ పాలనను ఈ సాకార రథంద్వారా అనుభవం చేసుకున్నాం.

జన్మాష్టమిరోజు చిన్నచిన్న సేవాకేంద్రాలనుండి కమలానగర్ సేవాకేంద్రానికి వచ్చేవారు. జన్మాష్టమి రోజున గుల్జార్దాదీరథంద్వారా చిన్నికృష్ణుడు వచ్చి అందరితో ఆడుకునేవాడు. ఆల్మైటి బాబా గుల్జార్దాదీజీ ద్వారా చాలా అద్భుతమైన పాత్రనభినయించే వారు. ఈ విధంగా అక్కడ క్రొత్త ప్రపంచంలో రాజకుమారీ రాజకుమారులు పరస్పరమెలా మాట్లాడుకుంటారు, పరస్పరగౌరవ మర్యాదనెలాఇచ్చిపుచ్చుకుంటారు, వారివ్యవహారం ఎలావుంటుందని ఇంతమంచి దృశ్యాలు దాదీజీ ద్వారా చూపించేవారు. సత్యయుగంలో ఆటలు ఈ ప్రపంచంలోలా వుండవు.

గుల్జార్దాదీజీచాలాశాంతంగా, సింపుల్గా వుంటారు. గుల్జార్దాదీ జ్ఞానగుహ్యతనుచెప్పి జ్ఞానంతో అందరిని పాలనచేసేవారు. ఆ సమయంలో మినిష్టర్గారు సేవాకేంద్రానికి రావాలనుకుంటున్నానని ఫోన్చేశారు. మినిష్టర్తో కలవాలంటే ముందే అనుమతి తీసుకోవాలి అలాంటిది ఆయనే ఫోన్ చేయడమేంటని మేము నమ్మలేదు. కాని సాయంత్రం సరైన సమయానికి సేవాకేంద్రానికి వచ్చేశారు.

ఆయనకు తప్పకుండా దాదీ ద్వారాఅలాంటి ప్రేరణ సాక్షాత్కారం జరిగి వుండవచ్చు. అందుకే ఎలాంటి అపాయింట్మెంట్ లేకుండా స్వయంగా ఆయనే వచ్చేశారు. దాదీజీ ఒక్క క్షణం కూడా ఖాళీగా కూర్చోవడం నేనెప్పుడూ చూడలేదు. ఒకవేళ కొంచెం సమయం దొరికినా చిరిగి పోయిన బట్టలు కుట్టేవారు. ఇప్పటికీ దాదీజీ ఎక్కడికి వెళ్ళినా సూది, దారం పెట్టావా అని అడిగే వారు.దాదీలజీవితం అంతలా సింపుల్గా వుండేది.

దాదీజీ ఎప్పుడూ తనకోసం ఆలోచించేవారుకాదు.దాదీద్వారా సందేశాల్లో ఎన్నో రహస్యాలను బాబా స్పష్టంచేశారు. దాదీజీ బుద్ధి చాలాపవిత్రంగా,దివ్యంగాఉండేది. వతనంలోచెప్పిన బాబాసందేశాన్ని విన్నది విన్నట్లు చెప్పేవారు. ఇలా దాదీజీ విశేషతలు ఎన్ని చెప్పినా తక్కువే. మరి ఆ విశేషతలను మనలో దారణచేసి మనంకూడా విశేషమైనవారిగా కావాలి. ఇదే దాదీజీకిమనంఅర్పించేనివాళులు.■



**జీవితంలో *సంతృప్తి* పడటం నేర్చుకున్నవ్యక్తి ఎప్పుడూ ఆనందంగానే వుంటాడు, అది చేతకానివ్యక్తి దుఃఖానికి గురవ్వుతుంటాడు.**

**- రమణమహర్షి.**

అంతరంగం శీర్షిక

# దృక్పథం

● బి. కె. రమేశ్, కరీంనగర్.

దృక్పథం అనే పదాన్ని దృష్టి, ఆలోచనాసరళి,అభిప్రాయం, దృక్కోణం, పరిశీలించువిధం వంటి భావనలో వ్యక్తీకరిస్తారు.

మనం చూస్తున్న 'దృక్పథం' నుంచే ఈ విశ్వంతోపాటు దాని అభిప్రాయాలు గోచరిస్తాయి. దీన్నే దృష్టిని బట్టి సృష్టిఅన్నారు. క్రమంగా ఇవే నమ్మకాలుగానిలిచి నిజమనే భ్రమలోకి తెస్తాయి. మానవుడు తన ఆలోచనాసరళి సరైందనే వాదన హేతుబద్ధం కాదు. విభిన్న తత్వాల సమ్మేళనమైవున్న ఈ అనంతప్రకృతి అనేకరకాల అభిప్రాయాల్ని ప్రస్ఫుటించేది మానవుణ్ని గందరగోళ పరచుటకు మాత్రం కాదు. సృష్టిలో తన సొంత అస్థిత్వం గౌరవప్రదంగా నిలుపుకోవడం దాని సహజ లక్షణమైవుంది.

ఉనికి వున్న వస్తువు తనదైన విడదీయలేని వ్యక్తిత్వమును స్వాభావికంగాకలిగివుంది.వ్యక్తిత్వంను కించపరిస్తే మనఅస్థిత్వమైన ఆత్మ సహజగౌరవానికి దెబ్బతగిలిందనే భావిస్తాం. ఇక్కడ అస్థిత్వానికి తొలి ప్రాధాన్యత కనిపిస్తుంది.

ప్రకృతి కూడా తన అస్థిత్వంపై మానవుడిజోక్యం, అధిపత్యమును సహించదు. పరిశోధనలో భాగంగా అతడు కనుగొన్న విజ్ఞానం, సిద్ధాంతమును సత్యం కాకుండా యత్నించడం ద్వారా విశ్వనాటకంలో మానవుడు ప్రకృతులమధ్య సంబంధం సామరస్యంగా కొనసాగాలనే దృక్పథాన్ని ప్రకృతి కలిగివుందని గ్రహించాలి. ఇటువంటిస్వాభావికలక్షణంమానవ సంబంధంలో కనిపిస్తుంది.

ఉదా:భార్య తన అంతరంగంలో దాగివున్న విషయమును భర్తకు చిక్కనివ్వకుండాజాగ్రత్తవహించుట మోసంకాదు. ఉభయుల కాపురం ప్రేమతో సజావుగా కొనసాగాలంటే అలా చేయాల్సిందేనంటూ ఆమె అందించు మూగసందేశంను గ్రహించే దృక్పథమును మనం అలవర్చుకోవాలి.లేనిచో సంఘర్షణ మొదలై అశాంతికి దారితీస్తుంది.

తన అస్థిత్వం చుట్టూ మరొకరి అభిప్రాయభావజాలం ముద్రించుకోవడంగానే తన రహస్య స్వచట్రం లోని నిగూఢ అంశాలు బహిర్గతం చేసినచో మానవునికి చులకనై బానిసగామారే అభిప్రాయాన్ని ముందేగ్రహించిన ప్రకృతితెలివిగా మానవ మేధస్సుకు చిక్కకుండానే చిక్కినట్లు భ్రమలో దించింది. ఇందులో భాగమే తరచుగా మానవుడు తాను కనుకొన్న సిద్ధాంతం మారుస్తున్నాడు.ఓటమి భావనతో నెమ్మదిగా మానవుని సంఘర్షణ మొదలవుతుంది.

నేడు కళ్లెదురుగా గోచరించే సిద్ధాంతాలు, విజ్ఞానం నిజమని భ్రమిస్తున్నా దాని వాస్తవం మరోలావుంది. ఉదా: సముద్రంలో నాచునుండి తొలిజీవి అమీబా అనే ఏకకణజీవితో ఉద్భవించిందని ఒకరు ప్రతిపాదించగా మరొకరు కోతి, చింపాంజీ నుండి మానవప్రాణి రూపాంతరం చెందినదంటూ నేటి విజ్ఞాన గ్రంథంలో ఇప్పటికీ బోధిస్తున్నారు కానీ వాస్తవం ఇదికాదు.

సృష్టిలో జీవం,జీవరాశి అనాది నుండే వుందని మానవుడు మానవరూపంతోనే వచ్చాడనే నిజసత్యం ఈశ్వరీయ శ్రీమతం చెప్పింది. శాస్త్రజ్ఞులు దీన్ని అంగీకరించక తాము కనుగొన్న సిద్ధాంతమునేనిజమంటూ కొనసాగించుట శోచనీయం.

'మానవ మేధస్సు పిచ్చిది, సైన్స్ గుడ్డిది'అనేసత్యాన్ని రూఢి పరుస్తూ ప్రకృతిలో నిర్మితమైన సాంకేతిక తనుతునాతునకలుగాసిద్ధాంతాల్ని మాసిపోయేలా చేసిన ప్రకృతి మానవునికే మరణ శాసనం లిఖిస్తుంది. కనుగొన్న సైన్స్ ద్వారా తనకు ప్రకృతిదాసోహం అయినట్లు మానవుడు విజ్ఞాన గర్వంతో వున్నాడు. ఇప్పటికీ కంట్రోల్‌చేసేశక్తి ప్రకృతి ఆధీనంలోనే వుందనే విషయాన్ని మరిచాడు.

ప్రాణాంతకమైన జీవవైరస్‌ను

లొంగదీయడం మానవునితో కాలేదు. సాంకేతిక వస్తువులు పరికరాలు కంట్రోల్‌లో రాకుండా అదుపుతప్పి ఎక్కడైనా కూలి పోతాయి.ఉదా: విమానాలు,ఉప గ్రహాలు.

ఎవరిపరిధిలో వారున్నచో సమత, మమత, వెల్లివిరుస్తుంది. 'లా'ను చేతుల్లోకి తీసుకోరాదని మరొకరిపై అధిపత్యం ప్రదర్శించ వద్దని శివబాబా శ్రీమతం చెప్పింది. ప్రకృతి రచనలో ఆత్మ భాగమైనా ఆడేఆట నియమాలు నటుల ఆధీనంలోనే వున్నవి. ఆత్మ తనని తాను కంట్రోల్ చేసుకుంటే అది గెలుపు. మరొకరికి వశమైతే అదిఓటమి. పదార్ధమునకు వశమై తన శక్తిక్షీణించడంతో ఆత్మ అశాంతికి లోనైంది.

మానవుని దుఃఖం, అశాంతి, సంఘర్షణతోనే ప్రకృతిసైతం అలజడిచెందింది. ప్రకృతి ఎవరిని తప్పపట్టకున్నా ఈ విషయంలో మానవుడే ప్రకృతిని దోషిగా చూపాలనుకోవడం మానవుని అహంకారానికి సూచిక.

నేడు ఏ సైన్స్‌ను, శరీరాలను భోగిస్తున్నావో, నీ వస్తువిలాసాలకై ఏ ప్రకృతిని గాయపర్చావో ఆ పంచతత్వాలు నీకు చరమగీతం పాడుతున్న సవ్వడినివినైనా నీ దృక్పథంను మంచిలోకి మార్చుకో! ఈశ్వరీయ జ్ఞానయోగాలను అల వర్చుకోవడం శ్రేయోదాయకం.■

**స్వాతంత్ర్య అమృత మహోత్సవం**



**వందే భారతమాతరం**

స్వతంత్ర భారతం, జయ భారతం, నా ప్రియ భారతం !
ఆదరణీయ భారతం, ఆదర్శనీయ భారతం, ఆత్మీయ భారతం !
భగవంతుని దివ్యఅవతరణ భూమి, నా జన్మభూమి !
ఆధ్యాత్మికభూమి, మహాతీర్థభూమి, పవిత్రభూమి !
భక్తిభూమి, అనురక్తిభూమి, యుక్తిభూమి !
శక్తిభూమి, జీవన్ముక్తి భూమి, సర్వప్రాప్తి భూమి !
జ్ఞానభూమి, యోగభూమి, దివ్యగుణభూమి !
సేవాభూమి, త్యాగభూమి, తపస్య భూమి !
ధర్మభూమి, కర్మభూమి, పుణ్యభూమి, ధన్యభూమి !
సత్యత - అహింస భూమి, సుఖ-శాంతిభూమి, సంస్కార-సంస్కృతీభూమి !
స్వతంత్ర అమృతమహోత్సవం నుండి - స్వర్ణిమభారతం దిశగా
సర్వుల స్నేహ, సహయోగాలతో కలిసి పయనిద్దాం లక్ష్యం సాధిద్దాం !
వందే భారతమాతరం !

- బి.కె. రత్నారావు, తాడేపల్లిగూడెం.

**రమ్యం**



ఉదయానికి సూర్యుని వెలుగు అందం
హృదయానికి స్వచ్ఛమైన దయ అందం
రంగులకు తెలుపు అందం - కర్మకు విలువ అందం
కవి కవిత్వానికి అలంకారం అందం
కర్షకుని కష్టానికి ఘర్మజలయే అందం - శిల్పికి శైలి అందం
సత్యయుగానికి సురులు అందం - దైవానికి దీవెనలు అందం
మోముకు చిరునవ్వందం - చీకటికి తారలు అందం
ఈ జగానికి దివ్య తారలందం - పల్లెకు పచ్చని పైరందం
పరంధామానికి పరమాత్మ వెలుగు అందం
కనుక మనమందరం శివబాబా అందాం
ఇదే మనందరికి జన్మ జన్మల అనుబంధం

- బి.కె. శ్రీను, రావికమతం, విశాఖ.



# తపస్సు

● రాజయోగిని గుల్జార్ దాదీజీ.

తపస్సు అంటేనే మానసిక ఏకాగ్రత. శరీరానికి అతీత మైనస్థితి అంటే శరీరాన్ని వదిలి వెళ్ళిపోవడంకాదు. మానసిక, శారీరిక ఏకాగ్రత కావాలంటే మనసు అలజడిలోకి రాకూడదు.

ఇప్పుడు మనమందరం కర్మ క్షేత్రంలోవుంటూ కర్మాతీతస్థితి యొక్క అనుభవాన్ని పెంచుకోవాలి. కర్మాతీతమంటే కర్మలకు అతీతంగా కావడంకాదు. ఇంద్రియాలున్నంతవరకుకర్మచేయాల్సిందే. కూర్చోవడం, తినడం, తాగడం కూడా కర్మనే. కర్మలు మనల్ని తమ వైపు ఆకర్షించకూడదు. పెయిన్ కిల్లర్ఇంజక్షన్‌తో నొప్పి సమాప్తమవుతుంది కాని తనవైపుకు ఆకర్షించదు. అలాగే కర్మల ఫల స్వరూపంగా తయారైన సంస్కారాలు ఈ ప్రపంచంలో ఎలాంటి కర్మబంధనాలు తమవైపుకు ఆకర్షించకూడదు. దీన్నే కర్మాతీత స్థితి అంటారు. అందరి లక్ష్యం ఇదే.

మనం చాలా మంచి మంచి సంకల్పాలు చేస్తాము కాని వాటిని పూర్తిచేయడంలో తేడావస్తుంది. బాబా మనకుఇచ్చే ప్రేమ,పాలనకు మనస్ఫూర్తిగా ప్రతిఫలం తిరిగి ఇస్తామని చెబుతాము. కాని తిరిగి ఇవ్వకపోతే బాబాతో కలసి ఎలా వెళ్తాము. మనం ఇంటికి తిరిగి వెళ్ళాలి అంటే రిటర్న్ఇవ్వాల్సిందే. బాబా మనల్ని నిమిత్తం చేశారంటే విశ్వమనే స్టేజ్‌పై మనం యాక్టర్లం కదా. బాబా మనలో ఏదో విశేషత చూసి ఉంటారు. అందుకే మనల్ని తన వారిగా చేసుకున్నారు. కాని ఆ విశేషతను మనమెంతవరకూ అవినాశిగా చేసుకున్నామనేది మనపైనే ఆధారపడివుంది.

ఈ విశేషతలు పరమాత్మ ప్రసాదం. నిమిత్తమవ్వడంతోపాటు నిరహంకారిగా కూడా ఉండాలి. ఏ విశేషతనైనా మనది అనుకంటే నష్టం జరుగుతుంది. నాదంటూ ఏమీ లేదు. జీవితంలో పరమాత్మ మనకు జన్మతః విశేషతలను వరధానరూపంలో ఇచ్చారు. అందుకే మనం వాటిని నిమిత్త భావంతో ప్రయోగించాలి. మనం మధ్యమధ్యలో అశరీరి అయ్యే సాదనను చాలాకాలంనుండి సాధనచేయాలి.

సమయానుసారంగాసాధారణత సమాప్తమవ్వాలి. ఇక్కడ చాలా కాలంగా స్వరాజ్యాధికారి అయిన వారే అక్కడ రాజ్యభాగ్యానికి అధికారులవుతారు. సేవ ముందు ముందు కూడా జరగుతుంది. కాని విదేహిస్థితి సాధననే పెంచుకోవాలి. మనం ఈ సాధనలో సంపన్నం, సంపూర్ణమైనపుడే నిమిత్తమవ్వగలుగుతాము. ప్రతి ఒక్కరు విజయులై ఫస్ట్‌నెంబర్‌లో అర్జునులుగాకావాలి. ఇదే బాబా యొక్క ఆశ. ఈ ఆశను మనం పూర్తి చేయాల్సిందే. చేస్తాంలే

## స్వర్ణాక్షరలిఖితం

బాబా మీ కన్నులు అజ్ఞానాంధకారాలను తొలగించే ఆశీర్వాదాల గనులు
ప్రతీరోజూ మా ముంగిట కురుస్తున్నాయి మురళీనాదాల సిరులు
పిల్లలైన మా అందరికీ దొరుకుతున్నాయి ఆనందపు నిధులు
శ్రీమతం మా జీవనాధారం ఆ ఆధారమే తెరచును మాకోసం స్వర్గద్వారం
ఉంటావు సంగమయుగమంతా మా జత
ఇక వీడములే నిను కల్పమంతా ఓ బాబా
జన్మ జన్మల ఈ మనబంధం చరిత్రలో
అజరామర స్వర్ణాక్షరలిఖితం

- బి.కె. మంజుల, గోరంట్ల, అనంతపురం.

చూద్దాంలే కాదు, చేయాల్సిందే అనుకోవాలి.

స్వయాన్ని గమనించికొని స్వదర్శనంచేసుకుంటూస్వమానంలో వుండాలి.ఎవరి బలహీన సంస్కారాలప్రభావంమనపైనపడకూడదు. పిల్లలూ! ఇక్కడ ధర్మం,రాజ్యం రెండూస్థాపన అవుతున్నాయనిబాబాచెబుతున్నారు. అందుకే మనం అందరి పట్లశుభభావన పెట్టుకోవాలి. ఎవరు ఎలాంటి వారైనా బాబాపిల్లలేకదా! అనుకొని వారికి సహయోగమిచ్చి ముందుకు నడిపించాలి.


శివబాబా సమానంగా అందరితోను ప్రేమగా వుండి ఎవరిపై తగుల్పాటు లేకుండా వుండాలి.మరి అందరికిమంచిజరగాలనే సద్భావన వుండాలి. దానికి ఫలితం తప్పక లభిస్తుంది.

మనం మనపైన శ్రద్ధ వహించాలి.మనల్ని ఎంతో మంది గమనిస్తుంటారు. అందుచేత వ్యర్థం,చెడు, సాధారణ సంకల్పాలనుండి స్వయాన్ని రక్షించుకోవాలి. మన సమూహం పెరుగుతూనే వుంటుంది. ఎన్నో క్రొత్తక్రొత్తవిషయాలు వస్తుంటాయి. ఏ విషయాలు అర్థంకావో అవి మనకు పరీక్షలు. సైడ్‌సీన్‌లో అన్నిరకాలవిషయాలు వస్తుంటాయి. మనముందు వచ్చే తుఫాన్లు పరీక్షలను బహుమతులుగా భావించి దాటేయాలి. ఇవన్నీ మనకుఅనుభవంచేయించి ముందుకు నడిపిస్తాయి. అలాంటి సమయంలో బుద్ధియనే విమానంలో పరంధామంలో సర్వశక్తివంతుడైన బాబాతో కూర్చుంటే దానిముందు ఏదీ పెద్ద విషయం కాదు. ఏ సమయంలోనైనా ఒక్కనిమిషం బాబాముందు కూర్చున్నామంటే విషయం సమాప్తమవుతుంది. ఈ సాధన తప్పకుండా చేయాలి.

ఒక్కనిమిషం యొక్క ప్రభావం చాలా వుంటుంది. ఈ సాధన తప్పకుండా చేయాలి. దీనితో మన స్థితి శక్తిశాలిగా తయారవుతుంది. మనం నిమిత్తభావనతో నిరహంకారిగా వుండాలి.

ఏమౌతుంది? ఎలా అవుతుందనే ఈ రెండువిషయాలు డిక్షనరీనుండేకాక మన ఆలోచనలు, భావననుండికూడా తొలగించాలి. భగవంతుడి పిల్లలై ఇలాంటి ఆలోచనల్లో వెళ్ళిపోతే స్వమానంలోవుండలేరు. బాబానుండి దొరికిన ప్రాప్తులు పురుషార్థంలో మనలనుముందుకు తీసుకెళ్తాయి. ఒంటరిగా వున్నా అందరిమధ్యలోవున్నామొత్తం ప్రపంచం మనల్ని చూస్తుందని గుర్తుంచుకోవలి.

ఒకవైపు బాబా ఇంకోవైపు పరివారం మనల్ని చూస్తుంటారు. ఒక్కసారి ఆలోచిస్తే మనల్ని మనం ఎలావుంచుకోవాలి?మంచి మంచివిషయాలు బుద్ధిలో వుంచుకుంటే మనపైన మనకు శ్రద్ధవుంటుంది అవే విషయాలు స్మృతిచేస్తూ వుంటే తనతోపాటు సర్వులకు ప్రాప్తి కలుగుతుంది. మానవాత్మలైన మనం పరమాత్మతో అందరినీ కలిపేందుకు నిమిత్తమైనవారిమనే ఆలోచన వుంటే ఎలాంటి వ్యర్థసంకల్పాలు రావు దీనివలన .■



*ఒక నిజాయితీ పరుడిపట్ల ఇతరులు ఎంతసంతృప్తికరంగా వుంటారో అంతే సంతృప్తి నిజాయితిపరుడికి తనపై తనకు వుంటుంది. ఒకవేళ ఏ విధంగానైనా ఏ సందర్భంలోనైనా అతనిలో అసంతృప్తి కలిగినా అది తనలోని నిజాయితి శక్తితో అధిగమించగలడు. ఇందుకు భిన్నంగా కుటిల మార్గాలను ఎంచుకున్నవ్యక్తి ఇతరులు మంచి ఉద్ధేశంతోచెప్పిన ఏ మాటను స్వీకరించలేరు. సత్యసందుని మనసు నిర్మలమైనది కనుక ఇతరు దివ్యగుణాలన్నీ సహజంగా చోటుచేసుకుంటాయి. సత్యమైన భగవంతుడు సత్యసందులను చూసి ప్రసన్నుడై వారికి సహాయం చేస్తాడు. సత్యత, నిర్మలమైన మనసు వ్యవహారంలో సాత్వికత వలన సత్యసందుడు భగవంతుని ఆశిర్వాదంతోపాటు అందరి ప్రేమను పొందుతాడు.*

**– రాజయోగి రమేష్‌షా భాయ్‌జీ.**



# ధృడమైన సిద్ధాంతం

ఒక ధనవంతుడైన వ్యక్తి పర్సు బజారులో పడిపోయింది. అందులో చాలా వేలరూపాయలు ఉన్నాయి. వెంటనే అతడు దేవాలయానికివెళ్ళి పర్సుదొరికినచో పేదవారికి భోజనం తినిపిస్తానని ప్రార్థించాడు.

అదృష్టవశాత్తు పర్సు నిరుద్యోగ యువకునికి దొరికింది.పర్సుపై దానియజమాని పేరుఉండుట వలన ఆయువకుడు ధనవంతుని ఇల్లు వెదికి పర్సుఅందజేశాడు. అపుడుధనవంతుడుఆయువకుని నిజాయితీకిప్రశంసించి ఆ యువకునికి బహుమతి ఇవ్వాలనుకున్నాడు కాని అతడు నిరాకరించాడు.ఆపై ఆధనవంతుడు యువకున్ని మరల రేపురమ్మన్నాడు. యువకుడు రెండవరోజు రాగానే ధనవంతుడు అతనికి చక్కని అతిథిసత్కారం చేశాడు. కొంచెం సేవటితర్వాత యువకుడు వెళ్ళిపోయాడు.

సమస్య దూరమైనంతనే తను దేవాలయంలో భగవంతుని ఎదుట కొన్ని ప్రతిజ్ఞలు చేశాననే విషయం ఆ ధనవంతుడు మరిచిపోయాడు. ఆ యువకుడు వెళ్ళిన తర్వాత ఆ ధనవంతుడు తన చతురతను భార్యతో చెప్తూ చూడు ఆ యువకుడెంత మూర్ఖుడో వేలరూపాయలలో ఏమీ తీసుకోకుండానే ఇచ్చి వెళ్ళాడు అన్నాడు. అపుడా ధనవంతుని భార్య నీవుసరిగ్గా ఆలోచిస్తున్నావా నిజానికి అతడు నిజాయితీపరుడు. అతడు కావాలనుకుంటే అంతా తన దగ్గరే ఉంచుకునేవాడు, అపుడు నీవు ఏంచేసేవాడివి, ఈశ్వరుడు ఇద్దరికీ పరీక్షపెట్టాడు కానీ అతడు పాస్అయ్యాడు, నీవుమాత్రం ఫెయిల్ అయ్యావన్నది.

అదృష్టం స్వయంగా నీ దగ్గరకు నడచివస్తే నీవు మాత్రం లోభానికి వశమై అతన్ని తిరిగి పంపేశావు. అతనివద్ద నిజాయితీ అనేపెట్టుబడిఉందిఅదినీవద్దలేదు, నీ తప్పును సరిదిద్దుకో, అతనిని వెదికిపనిలో పెట్టుకోమని ధనవంతునిభార్య సలహాఇచ్చింది. ధనవంతుడా యువకుని వెదుకసాగాడు.

కొన్నిరోజులతర్వాతఆయువకుడు వేరే ధనవంతునివద్ద పనిచేస్తూ కనిపించాడు. ఆ ధనవంతుడా యువకుని బాగా ప్రశంసించి పర్సుకుసంబంధించిన సంఘటన గురించి వివరించాడు. అపుడు ఆ ధనవంతుడు, ఆరోజు ఇతడు నా ఎదుటే పర్సుతీసుకున్నాడు. నేను ఆయువకునివెనుకే వెళ్ళి మీ వాకిట్లోనిలబడి నేనుఅంతా విన్నాను, ఇతని నిజాయితీకి నేను పూర్తిగా సంతృప్తిపొంది నిశ్చింతగా ఉన్నాను అన్నాడు. ఇది విని ఆ ధనవంతుడుతిరిగివెళ్ళిపోయాడు.

నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యంచేసినందున ధనవంతుడు ఒక నమ్మకస్తుడైన వ్యక్తిని కోల్పోయాడు. ఆ యువకునివద్ద తన సిద్ధాంతంపై స్థిరంగాఉండే నైతిక బలంఉంది.అతడు పర్సుతెరవాలన్న ఆలోచనే చేయలేదు. అతని నిజాయితీకిబహుమతిలభించింది. రెండవ ధనవంతునివద్ద నిర్ణయం తీసుకునే యోగ్యతఉంది అతనికి ఒక ఉత్సాహ వంతుడైన మంచి యోగ్యతగల నమ్మకస్తుడైన వ్యక్తి లభించాడు.

సిద్ధాంతాలపైదృఢంగాఉండడం వలన మీకు క్షణికమైన నష్టం కనిపించవచ్చు కాని మీరు అంచనాకూడా వేయలేనంత దూరంగావున్న ఫలితాలు మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తాయి.■



**విజ్ఞాన *సముపార్జన* మనిషికి ఒక నిధిలా ఉపయోగపడుతుంది. దానిని నిత్యజీవితానికి అన్వయించుకొని అమలులో పెట్టాలి.**

**- అరవిందుడు.**



# అలౌకిక అనుభవం

● బి. కె. బ్రిజ్‌మోహన్ భాయ్‌జీ, ఢిల్లీ.



జానకీ దాదీజీలో ఎవరినైనా ఒక్క సెకండులో తన వారిగా చేసుకునే అద్భుతమైన శక్తివుండేది. ఏ వి.ఐ.పిలైనా ఎవర్ని కలిసినా దాదీజీ 'మేరాభాయి' అని పిలిచేవారు. అందువలన తమ లౌకికపదవిని కూడా మరిచిపోయి దాదీజీతో మమేకమయ్యేవారు.

దాదీజీకి తనదృష్టి ద్వారా, సంకల్పాలద్వారా పరిచయంలేని వ్యక్తులను కూడా తనవారిగా చేసుకొనే అద్భుతశక్తివుంది. వారు దాదీజి చెప్పేవిషయాలను చాలా ఏకాగ్రతతో వినేవారు. దాదీజీ వైబ్రేషన్స్ విశ్వంలో ఏ కోణం వరకైనా చేరగలిగే శక్తివుండేది. బాబా అందరిపేర్లు మార్చి అలౌకిక పేర్లు పెట్టారుకాని నాపేరుమాత్రం మార్చలేదుఅని దాదీజీ అనేవారు. బాబా దాదీజీని విదేహిజనక్ అని పిలిచేవారు. ఆ పేరే ఆమెకి సరియైనది అందుకే పేరు మార్చలేదు. జ్ఞానం, యోగం, ధారణలను తన జీవితంలో పూర్తిగా ఇముడ్చుకుని ఆత్మికవ్యక్తిత్వాన్ని తయారు చేసుకున్నారు.

దాదీజీని 'మెసెంజర్ ఆఫ్ గాడ్' (భగవంతుడి సందేశి) అనేవారు. దాదీజీ అందరికంటే భిన్నంగా వుండేవారు. ఆమె దృష్టికోణం వేరు. నాకొకవిషయం గుర్తుంది ఢిల్లీ పాండవభవన్‌లో ఆఫీస్‌రూం ప్రక్కనే జానకిదాదీజీ గది వుండేది. నేను ఉదయాన్నే ల్యాండ్‌ఫోన్‌లో ఎవరితోనోచాలా గట్టిగా మాట్లాడుతున్నాను.ఆరోజుల్లో ల్యాండ్‌ఫోన్‌లైన్లు ఉదయాన్నే కలిసేవి. దాదీజీనుండి నాకు పిలుపు వచ్చింది. నన్ను దాదీజీ ఉదయాన్నే ఇంత గట్టిగా ఎందుకు మాట్లాడుతున్నావని అడుగుతారనుకున్నాను.

నేను దాదీజీదగ్గరకు వెళ్ళినప్పుడు మీరు ఎవరితో ఏపనికోసం మాట్లాడుతున్నారోనాకుతెలియదు కాని మీపని సఫలం కావాలని నేను శుభసంకల్పం చేశానన్నారు. నా కళ్ళల్లో నీళ్ళువచ్చేశాయి. ఇంత శుభభావన, శుభకామన పెట్టుకునే వ్యక్తి ఈ ప్రపంచంలో ఎవరూ ఉండకపోవచ్చు. దాదీ విదేహి స్థితిలో వున్నందున ఎప్పుడూ అలసిపోయేవారుకాదు.

దాదీజీ ఎక్కడినుండి ఢిల్లీ పాండవ భవన్‌కు వచ్చినా రాత్రి 9.30గంటలకు అందరిని పిలిచి జ్ఞానంవిషయాలు, క్లాసుచెప్పడం మొదలుపెట్టేవారు. బాబా ఖజానాలను పంచాలన్నట్లు చాలా స్పీడ్‌గా ఎన్నోవిషయాలు చెప్పేవారు. బ్రహ్మాబాబాకూడాశక్తివంతమైనభాషలో ఇలాగే చాలా స్పీడ్‌గాచెప్పేవారు.

ఢిల్లీలో అన్నింటికంటేపెద్ద స్టేడియం ఇంధిరాగాంధీ స్టేడియం ఆ స్టేడియంలో కార్యక్రమం చేయాలనుకొని, దాదీజీని ఆ కార్యక్రమానికి రమ్మనిపిలిచి క్లాసులోకూడా అందరికీచెప్పాము. దాదీజీవైబ్రేషన్స్ వలన ఆ కార్యక్రమానికి 30వేల మందివచ్చారు.కాని స్టేడియంలో 20వేలమందిపడతారు. మేనేజ్‌మెంట్‌వారు ఆశ్చర్యపోయారు. ఈ స్టేడియంలో ఇప్పటివరకూ ఎన్నడూ ఇంతగా ఫుల్ అవ్వలేదు గవర్నమెంట్ శెలవు ఇచ్చినా కాని ఈ స్టేడియం నిండదు. ఈరోజు పూర్తిగా నిండిపోయింది అన్నారు. ఇది దాదీజీఅద్భుతమే. ఆ కార్యక్రమంలో ఎంతోమంది నాయకులను స్పీకర్స్‌రూపంలో పిలిచారు. వారుకూడాదాదీజీని కలుసుకుని చాలా సంతోషపడ్డారు.

ఢిల్లీ ఓ.ఆర్.సి రిట్రీట్‌సెంటర్‌లో గీతాభగవానుడు ఎవరు? అనే కార్యక్రమం చేశాము. ఇది మూడురోజుల ప్రోగ్రాం. అందులో

సాధువులు, మహాత్ములు, జడ్జీలు, మీడియావారిని పిలిచారు. ఈ కార్యక్రమానికి దాదీజీ మీరు తప్పక రావాల్సిందేననిచెప్పాము.అందరూ ఒక టాపిక్‌పైన తమతమ అభి ప్రాయాల్ని వ్యక్తంచేస్తున్నారు. ఇంతలో దాదీజీ సభలోకి రాగానే అందరూ గౌరవార్థం లేచి నిలబ డ్డారు.దాదీజీ తనప్రాక్టికల్ జీవితం ఆధారంగానే గీతాభవానుడు వర్తమాన సమయంలో ఎలా భారతదేశంలో వచ్చారు. తన కర్త వ్యాన్ని ఎలాచేస్తున్నారని సూటిగా చెప్పారు. ఇదివిన్న తరువాత బాబా జ్ఞానానికి అనుకూలంగా స్పష్టీ కరణతో ఉపన్యాసం చెప్పారు. ఇదే జానకీదాదీజీ ప్రభావం.

ఢిల్లీఫోర్టులో అంతర్జాతీయ 'యోగాడే'రోజు పెద్ద కార్యక్రమం చేసాము.కేంద్రమంత్రి ఆయూష్ మాకు ప్రతీసంవత్సరం ఆ స్థానాన్ని చ్చేవారు. యోగాడేరోజున ఎన్ని కార్యక్రమాలు జరిగినా అన్నింటి కంటే పెద్దసంఖ్యసమూహం బ్రహ్మాకుమారీలదే వుంటుంది. ఒక సంవత్సరం దాదీజీతో ఇది ఒక చారిత్రక స్థానం ఇక్కడ భారతదేశ జాతీయజెండా ఎగరవేస్తారు మంత్రి ప్రసంగం కూడా ఇక్కడే జరుగుతుంది. అలాంటి స్థానంలో రాజయోగినీల ప్రసంగం ఉండాలి అందుకే మీరురావాలని దాదీజీతో చెప్పాము. యోగా కార్యక్రమం ఉదయం 7గంటలకు వుంటుంది. కాని దాదీజీ ఆ స్థానమహత్యాన్ని గ్రహించి ఉదయం 6.45 నిమి షాలకే అక్కడికి చేరుకున్నారు. దాదీజీ కార్యక్రమ మహత్యాన్నిబట్టి తనని తాను సర్దుకుంటారు. 6.45కి చేరుకుని ప్రభావశాలి ఉపన్యాసంతో యోగంగురించి, యోగదాతగురించి,యోగంద్వారా విశ్వపరివర్తన ఎలా అవుతుందని చెప్పారు.

దాదీజీ ఎక్కడికి వెళ్ళినా ఢిల్లీలో ఆగేవారు. ఎక్కడికి వెళ్ళినా ప్రతీ డిపార్ట్‌మెంట్‌వారిని ఉత్సాహ పరిచేవారు.కిచెన్‌లోకివెళ్ళిఅందరిని కలిసేవారు. ఒకసారి లిఫ్ట్‌పాడైతే అందరూ దాదీజీని లిఫ్ట్ సరి అయితే వెళ్దాం ఆగమన్నారు. కాని దాదీజీ13అంతస్థులు నడుచు కుంటూ దిగారు. ఒక్కసారి ఆలోచించండి దాదీజీ విల్‌పవర్ ఎంతగొప్పదో.

భారతదేశ రాష్ట్రపతితో మధ్య మధ్యలో కలుసుకోవడానికి వెళ్ళే వాళ్ళం. ఒకసారి ఆయన దాదీజీతో ఆశీర్వాదంతీసుకోవాలనిఅడిగారు. దాదీజీ ఆబూలో ఉన్నారని చెప్పాము. రాష్ట్రపతి సెక్రెటరిని పిలిచి నేను ఈ సంవత్సరంలో దాదీజీని ఎలాగైనా కలవాలన్నారు. అలానే ఆబూప్రోగ్రాం తయారైంది. ఆయనఆబూవచ్చితనప్రసంగంలో ఈ వయసులో కూడా దాదీజీ ఇంతసేవచేస్తున్నారనికొనియాడారు.

భారతదేశంలో చాలాస్థానాల్లో బ్రహ్మాకుమారీస్ మెగాప్రోగ్రాంలు జరిగినప్పడు దాదీజీతోపాటు ప్రయాణించే అవకాశం నాకు లభించింది. పెద్దపెద్ద పబ్లిక్ ప్రోగ్రాంలు జరిగినపుడు నేనొక విషయం నోట్‌చేశాను. దాదీజీ నన్ను ముందు భాయిసాబ్ చెబు తారనేవారు. అదివిని నా మనసు పులకరించిపోయేది. దాదీజీ నన్ను ముందుంచి గౌరవాన్నిస్తూ శక్తినింపేవారు. ఆ ఫంక్షన్‌లో ప్రతీ చోట మొత్తం జ్ఞానాన్ని తన వ్యక్తిత్వంలో తీసుకొచ్చి తనమాటల ద్వారా,వైబ్రేషన్స్‌ద్వారా అందించే వారు.

దాదీజీప్రతీసభలోమూడుసార్లు 'ఓంశాంతి' చెప్పేవారు. ఆ సభలో ఎవరు కూర్చున్నా 'ఓంశాంతి' అర్థ స్వరూపంలో ఉండేవారు. మొదటి ఓంశాంతి నేనెవరు? రెండో ఓంశాంతి నావారెవరు? మూడవ ఓంశాంతి నేనుఇక్కడికి ఎందుకు వచ్చాను?ఈ మూడు మాటల్లోనే జ్ఞానసారమంతా చెప్పేవారు. దాదీజీ మొత్తం సభలో అందరితో మేరాబాబా (నాబాబా)అని చెప్పించేవారు.దాదీ నాబాబా అన గానేఅందరిమనసుల్లో పరమాత్మ మా తండ్రి అనేభావన కలిగేది. మేరాబాబా, ప్యారాభాబా, మీఠా బాబా అని చెప్పించేవారు.బాబాతో స్నేహం జోడించి పరమాత్మలా మనంకూడా మధురంగా తయా రవ్వాలని చెప్పేవారు. చివరిలో శుక్రియా బాబా! అనేవారు.

సత్యత,ధైర్యత,గంభీరత, నమ్రత, మధురత ఈ ఐదువిషయాలు వ్యక్తిజీవితంలో ఉన్నట్లయితే వారు

మిగతా 21వ పేజీలో...



# విజయమాలకై పరీక్ష

● రాజయోగిని ప్రకాశమణి దాదీజీ.

మనం ఎవరం? అని ప్రతి ఒక్కరూ తమను తాము ప్రశ్నించుకోవాలి. భగవంతుడికి విద్యార్థులమా?రాజయోగులమా? మనం విశ్వసేవాధారులమా? ప్రపంచ సేవకులమా? పూజ్య దేవతలమయ్యామా? మనం బ్రహ్మాబాబాను అనుసరించే వారిమా? మనం అనంతమైన త్యాగులు, సన్యాసులమా? మనం రాజర్షులు, తపస్వీలమా? అపుడు మరి మన కర్తవ్యం ఏమిటి? మన బాధ్యత ఏమిటి? స్వపరివర్తన ద్వారా విశ్వపరివర్తన చేయడం.

ఈ సమయంలో బాబానుండి మనకోసం ఆజ్ఞ ఏమిటి? మన చదువుకు అంతిమపరీక్షఏమిటి? గౌరవంగా ఉత్తీర్ణులు కావడం, కర్మాతీతం కావడం. మన పరీక్షా ఫలితాలు ఏమిటి? విజయమాలలో విజయీ రత్నాలుగా కావడం. అయినప్పటికీ మనం ఎవరమనే ప్రశ్నవస్తుంది. మనం పరమపిత పరమాత్మకు డైరెక్ట్ సంతానం. మన పరివారం ఏమిటి? పరస్పరం సోదరులం లేక సోదరీసోదరులం. వీరంతా మన ఈశ్వరీయ పరివారం.

కావున ఈవిధంగా మన చదువులో ఏమేమి సబ్జెక్టులున్నాయో వాటన్నిటినీ పరిశీలించుకోండి. 1.మనబుద్ధిలో జ్ఞానం యొక్క అన్ని విషయాలు సరిగా ధారణఅయ్యాయా?ఏసమయంలో ఏ విషయంలోనైనా జ్ఞానయుక్త జవాబు ఇవ్వగలమా? 2.మన యోగస్థితి ఎలావుంది? 3.మన వద్ద అన్ని శక్తుల ఫలితం ఏమిటి? 4.మనలోవిలువలెన్ని ఉన్నాయి? 5.మనలో బలహీనత ఏ విషయంలో వుంది? 6.మనం ఎంత వరకు నష్టోమోహ అయ్యాము? 7.మనం మాయను జయించి జగత్తును జయించినవారుగా, విజయరత్నాలమయ్యామా?8.మనకు డ్రామాపైన స్వయంపైన ఎంత వరకు నమ్మకం వుంది? ఇలా అనేక ప్రశ్నలు మనకు మనం వేసుకోవచ్చు. వాటి ద్వారా మన చార్టును పరిశీలించుకోవచ్చు. పరీక్షలా ప్రతిఒక్క విషయాన్ని స్వయాన్ని ప్రశ్నించుకొని వాటికి సమాధానం వ్రాయండి. మీ చార్టుకు స్వయంగానే జవాబు వస్తుంది.

మరల చూడండి మనం అన్నింటిలోనెంబర్‌వన్‌గావున్నామా? లేక నంబర్‌టువున్నామా? అని మిమ్మల్నిమీరు ప్రశ్నించుకోండి. ఒకవేళ ఇపుడు పరీక్ష వ్రాస్తే ఎంతవరకు పాస్ కాగలం వాటన్నిటిలో ఒకవేళ నిర్భయత్వం యొక్క పరీక్షవస్తే నిర్భయులమా లేక పిరికివారమా?అలానే ఏదైనా దేహ అభిమానం యొక్క పరీక్ష వస్తే ఆత్మాభిమానులుగా ఉండగలమా? ఎందుకనగా దేహ అభిమానం దిగజారుస్తుంది. సత్యం గురించిన సమాధానం ఇవ్వవలసివస్తే భయంతో సత్యం చెప్పలేరు, అబద్ధమాడేస్తారు కావున భయపడటానికి కూడా దేహాభిమానమే కారణం.

ఇపుడు 'ముక్తిసంవత్సరం' జరుపుకొమ్మని బాబా చెప్పారు. మనం ఈ పరీక్షలన్నింటిలో పాసైతే ముక్తిలభిస్తుంది. పవిత్రత సబ్జెక్టులో సంబంధ సంపర్కాలతో, సంకల్పాలు ఎంతవరకు యదార్థంగా వున్నాయి? ఇందులో మొదట మీకు మీరే మార్కులు వేసుకోండి. వాచా, కర్మణలలో

### జోక్ బాక్స్

**తండ్రి:** మిలట్రీ ఉద్యోగులు సైనిక్ పురికాలనీలోఉంటారు, ఏర్‌ఫోర్స్ ఉద్యోగులువాయుపురికాలనీలో ఉంటారు. మరి నేవి ఉద్యోగులు ఎక్కడుంటారు సోము?

**సోము:**పానీపూరికాలనీలోఉంటారేమో నాన్న.

**తండ్రి:** ఆ..!

ఎంతవరకు పూర్తి మార్కులు తీసుకోగలం? మీకు మీరే పరిశీలించుకోండి.

జరిగిందేదో మంచికే జరుగుతున్నది జరగబోయేది కూడా మనమంచికే. దీనివలన అన్ని పరిస్థితులలోమనస్థితిఅచంచలముగా వుంటుంది. ఇతరులను చూసినపుడు సాక్షీ స్థితిలో ఉంటున్నారా లేక ద్వేషం, అసహ్యం వస్తున్నదా లేకజాలిదయాభావనఉంటుందా? శుభభావన, సద్భావన అంటాం మరి అలాంటి భావన ఉందా? మరోలా చెప్పాలంటే శుభప్రదమైన ఆశీర్వాదాలున్నాయా? శుభ భావన అంటేనే శుభాశీర్వాదాలు. అలాంటి చాలా పాయింట్లు మీకు మీరు మననం చేసుకోండి. మీరే మిమ్మల్ని చెక్‌చేసుకొని మీ పరీక్షాపత్రం మీరు తయారు చేసుకోండి. తిరిగి విజయమాల విశేషతలేమిటి? వాటిని మనం ఎంతవరకు జీవితంలో ఉపయోగిస్తున్నామని చెక్‌చేసుకోండి.

మనస్థితి బాగుంటే ఇతరులకు సహజంగా జ్ఞానభాణం తగులుతుంది. ఇతరులపైన మనస్థితి ప్రభావం తప్పక పడుతుంది. నిజానికి ఆత్మలైన మనం కూడా ఎంతస్వచ్ఛమైన వారిమంటే ఏకొంచెం దోషం ఏర్పడినా దాని ప్రభావం మనస్థితిపై వెంటనే పడుతుంది. ఇతరుల సాంగత్య దోషంలో రాకుండా జాగ్రత్తగా ఉండాలి.■

## మహాశివరాత్రి



పరంపితపరమాత్ముని దివ్యఅవతరణ మహాశివరాత్రి
అష్టరత్నాలు త్యాగతపస్వీల జ్ఞానసౌభాగ్య పావనరాత్రి
పాపాలను హరించే హరుడవ్వు
బాధలను తొలగించే భవ్యుడవ్వు
మాయను మట్టికరిపించిన శ్రీశైలమల్లన్నవ్వు
మృత్యుభీతితో శివలింగాన్ని ఆలింగనం చేసుకున్న
మార్కండేయున్నిరక్షించిన జగద్రక్షకుడవ్వు
ముఖ కవళికలపై ఆత్మిక చిరునవ్వు సాత్వికగుణ మస్తకతిలకధారణతో
మెరిసే శ్వేత హంసలకు పరమపితవ్వు
సద్గుణ అంతరంతో దృష్టిని మార్చుకున్న నిర్మోహి మాతలకు
జ్ఞానామృతాన్ని త్రాగించిన సోమనాధుడవ్వు
ప్రతినిత్యం నీ మురళీగానానికై ఎదురుచూసె గోపికలకు
సదా తోడునీడమైయున్న మురళీధరుడవ్వు
చీకటిలోనున్న వారికి దారి చూపుతావ్వు కష్టంలో ఉంటే ఆదుకుంటావ్వు
దుఃఖంలో వున్నవారికి శాంతిశక్తినిస్తావ్వు
ప్రతి ఒక్కరికి సాయంచేసే విశ్వకల్యాణకారుడవ్వు
తన సర్వశక్తుల ఖజానాలన్నింటిని పూర్తిగా పిల్లలకి పంచి
ఆనందించే ఆనందసాగరుని ఆనందరాత్రిని
అందరితో కలిసి మెలసి ఈ మహాశివరాత్రిని జరుపుకుందాం

\- బి.కె. ఆండాళ్, చీరాల, ప్రకాశం.

★ 19 వ పేజి తరువాయి....

### అలౌకిక అనుభవం

శ్రేష్ఠయోగియై ఇతరుల జీవితాన్నితయారు చేయగలుగుతారు. దాదీజీ 'తెల్లని వస్త్రాలు జేబుఖాళీ అయినా కాని నేను మొత్తం ప్రపంచానికి చక్రవర్తిని' అనేవారు. ఈ ప్రపచంలోని ప్రాప్తులన్నీ పరమాత్మ ప్రసాదించిన విగాభావించివాడాలనిచెప్పేవారు. అప్పడు మనజీవితం సుఖప్రధమై ఇతరులసేవచేయ గలుగుతాము.'నాది'అంటే హద్దుల్లోకి వచ్చేస్తాము, 'అందరూ మనవారే' అంటే బేహద్‌లోకి వసామని చెప్పేవారు. అంతిమంలో దాదీజీ ఏదిమాట్లాడితే అది సత్యమయ్యేది. దాదీజీ అంతిమంలో నేను శరీరంవదిలిపెడితే ఒక్కరూపాయి కూడా ఖర్చుకాకూడదని చెప్పేవారు. దాదీజీ తన ఇష్టప్రకారమే వెళ్ళిపోయారు. మనమంతా దాదీజీలానే ధారణాయుక్త జీవితాన్ని తయారుచేసుకుని బాబా కార్యాన్నిసంపన్నం చేయాలి.■

# నింద

● బి. కె. గోపిబెహన్‌జీ, లండన్.



ఆరు వికారాలను జయించేందుకు జ్ఞానవంతులైన వ్యక్తులకుధ్యాసఉండనే ఉంటుంది. కాని చెడ్డదైన మాయను జయించేందుకు మనిషి చాలాసార్లు సంఘర్షణపడుతూ ఓడిపోతాడు. మాయయొక్క అలాంటి ఒక రూపం ఏమిటంటే ఇతరులలో దోషాలువెదికివారినినిందించడం. చాలామంది జీవితంలో నిగ్రహాన్ని పాటించాలని కోరుకుంటూ కూడా మాటలలో నిగ్రహాన్ని కోల్పోవడం చూస్తుంటాం. వారు తమ నాలుకను తమనియంత్రణలో ఉంచుకోలేరు.

6అడుగులపొడవుగల మనిషి కూడా మూడుఅంగుళాలనాలుక ముందు ఓడిపోతాడు. పరస్పరం మాటలులేకున్నాఆవ్యక్తి ఎదురుగా లేనప్పటికి కూడా వారుతమ పెదవులను ధనస్సులాచేసి వాటి ద్వారా విషపూరితమైన మాటలనే బాణాలను వదులుతుంటారు. ప్రతిఒక్కరినీ నిందించడంవలననే వారిమనసు ఆనందపడుతుంది.

ఇతరులను నిందించడంలో మునిగిఉండే వ్యక్తికి ఇదిమంచి పనికాదని అర్థంచేయించినా 'నేను సత్యంచెబుతున్నాను, దీనిని నేను ఋజువుచేసి చెప్పగలను' అంటాడు. పైగా మీరెవరినైనా అడగండి ఫలానావ్యక్తిలో నేను చెప్పిన దుర్గుణం ఉందోలేదో తెలుసుకోమంటాడు. అవును ఆ వ్యక్తిలో ఈ లోపం ఉందని మీతో అందరూచెప్పినా మరి నేను చెప్పినపుడుఎందుకుఅడ్డుకుంటున్నారు. నేను ఎవరికీ భయపడను ఎవరి గురించైనా ఉన్నది ఉన్నట్లుగా సత్యం చెప్పడం తప్పా? అంటాడు.

ఒకవేళ ఎవరిలోనైనా ఏదైనా బలహీనత లేక దుర్గుణం ఉన్నచో దానిని వర్ణించడం నింద అనే పాపమా! లేక దీనిని యదార్థమైన సత్యాన్ని వర్ణించడం అంటారా? కేవలం అసత్యంగా నిందించడం పాపమా! లేక ఇతరుల వ్యక్తిత్వం, పనిలోని దోషాలవర్ణన కూడా వ్యర్థమా!లేకమనలోదుర్గుణాలను వృద్ధిచేసుకోవడమా!

మనం సూటిగా చెప్పాలనుకుంటాం. మనం మహిమచేస్తూ ఉండడమే వ్యక్తిపూజగా భావిస్తాం. నేడు ప్రపంచంలో ఏ మనిషి కూడా సంపూర్ణగుణవంతుడు కాదు. అందువలన వారిలోని దోషాలను చెప్పడం సహజం. దీనినెందుకు చెడుగా భావించాలంటారు. ప్రజాస్వామ్యంలో పవర్ లేని వారికర్తవ్యం పవర్‌లో ఉన్న వారిని గట్టిగా విమర్శించి వారి దోషాలనుఎత్తిచూపాలనిఅంటారు. ఇది విమర్శకుల జాగరూకత సూక్ష్మదృష్టిని తెలియజేస్తుంది.

ఉన్నది ఉన్నట్లుగా సత్యం చెప్పడం వలన ఎవరికైనా మంచి జరగవచ్చు. ఈ ప్రశ్నకు జవాబు తెలుసుకునేందుకు నాలుగు విషయాలు ఆలోచించాలి.

**స్వస్థితి**

ఒక వ్యక్తి ఇతరులుచేసే పని గురించి విమర్శిస్తున్నచో మొదట ఆలోచించవలసిన విషయం అతని మానసికస్థితి ఎలా ఉంది? ఇతరులను కటువుగా విమర్శించే వారి మనసులో అహంకారం ఉంటుందని పరిశీలనలో తేలింది. వారు స్వయాన్ని ఇతరులకన్నా ఎక్కువ నేర్పరులు బుద్ధిమంతులు మరియు వివేక వంతులుగా



**ఆరోగ్యం, విద్వత్తు, సత్సాంగత్యం, ఇంద్రియనిగ్రహం కలవారే ఐశ్వర్యవంతులు.**

**- వివేకానందుడు.**

భావిస్తారు.ఆ నషాలోనే వారు అసహ్యంగాఇతరులను నింది స్తారు. వారుమాట్లాడేది సత్యమైన ప్పటికీ అహంకార పూరితంగా ఉంటుంది. వారి మనసులో ఈర్ష్య ఉన్నట్లుకూడా గమని స్తాము.

ఇతరులు ఒకవ్యక్తిని ప్రశంసిం చడం వారు సహించలేరు. అసూయకువశమై వారిలోని లోపాలను చెప్పడం ప్రారంభిస్తారు. పైగా ఆమనిషిలో ఫలానామంచి ఉందికానీ చాలాచాలా చెడ్డ విషయాలున్నాయి. మీకేం చెప్ప నంటాడు. ఇలా అతడావ్యక్తిని ఇతరుల దృష్టిలో దిగజార్చే ప్రయత్నం చేస్తాడు. అతని మనసులో మనుషులు తనను తెలివిగల మంచి కార్యకర్తగా భావించాలి.

నా మాటకు విలువనివ్వాలన్న సూక్ష్మభావన ఉంటుంది. ఈ విధంగా నిందించే మనసుగల ఆ వ్యక్తి తన అంతరాత్మకు పట్టీ బిగించికూడా అసత్యాలు చెప్తుం టాడు. వాతావరణంలో తామసిక తరంగాలనువ్యాపింపజేస్తాడు.అతని మనసులో ద్వేషం ఉత్పన్నమై ద్వేషానికివశమై ఇతరుల మనసు లలో కూడా ఆ వ్యక్తిగురించి విషం నింపుతాడు. పైగా ఆవ్యక్తిపై నాకేమైనా శత్రుత్వమా అతని పనిలో మొదటికన్నా ఎక్కువగా సవరణ జరగాలంటాడు. తన నశాలో మునిగిపోయిన ఆ వ్యక్తికి మనసులోఒకచీకటిమూలదాగిన ఈ అహంకారం ద్వేషం అసూయ అనే భూతాల సమూహం మాట్లా డుతుందని తెలియదు.

అతడు క్రమశిక్షణను భంగం చేసి నియమ నిష్టలను బలిచేసి గంభీరతకు తిలాంజలినిచ్చి జిహ్వాచాపల్యంతో మత్తెక్కిన వాడై ఒక ఓంటెముక్కుతాడు పట్టుకున్న ఎలుక వెనుక వెళ్ళినట్లుగా వెళ్తాడు. అయినప్పటికి నేను చాలా ఉన్నతమైనవాడినని భావిస్తాడు. భగవతుని గుణాల మహిమ చేసే బదులు తనదుర్గుణాలను తొల గించుకునేబదులుపరచింతనలో బడి తనశ్వాసను వ్యర్థంగా పోగొ ట్టుకోవడంలో మిథ్యాఆనందాన్ని పొందుతాడు. నిజానికది హత్య లాంటి విషపూరిత ఆనందం.

### దృష్టికోణం విధి

వ్యక్తిమనసులోద్వేషంఅసహ్యం ఈర్ష్యఅహంకారంలాంటివిలేనిచో అతడు చెప్పేవిధానమే వేరుగా ఉంటుంది. అతడు సానుభూతితో స్నేహంతో ఇతరులను అతనిచెడు నుండి వదిలించేందుకు మధుర మైన మాటలతో సలహా ఇస్తాడు. అతడు గుచ్చుకునే లేక పేరు చెడగొట్టే భావంతో మాట్లాడడు. అతని ముఖంలో గట్టిగా నవ్వుతూ ఉండేలేక రోషపూరిత గుర్తులు వుండవు. అతడు ఆత్మ చింతన స్థితిలోఉంటూ ఇతరుల మంచికోసం వారికి ఈశ్వరీయ జ్ఞానంలోని నియమాలు, దివ్య మర్యాదలను తెలియజేసేందుకే మాట్లాడుతాడు.

మిగతా 33 వ పేజీలో...

### శాంతశక్తి



శాంతి సాగరుడు పరంపిత పరమాత్మ
శాంతికి చిహ్నం శ్వేతకపోతం
ఓంశాంతిలోనే ఉంది శాంతి
శాంతి ఆత్మయొక్క స్వధర్మం
శాంతిలోనే ఉంది మనసుకు ప్రశాంతత
శాంతిదూతలమై విశ్వసేవచేయాలి
శాంతి విజయానికి రాచబాట
శాంతి ఉన్నత శిఖరాలకు చేరిస్తే
అహంకారం అశాంతి పాలుచేస్తుంది
శాంతి సదా ప్రశాంతతను కోరుతుంది
శాంతశక్తిలోనే ఉంది సర్వశక్తుల సమాహారం
శాంతిమూర్తివై నిరంతరం పయనం సాగించు

- బి.కె. భారతి, బిహెచ్ఇఎల్ ఎన్‌క్లేవ్, సికింద్రాబాద్.

అంతరంగం శీర్షిక

# దృష్టాంతము

● బి. కె.సాంబమూర్తి, పరకాల, వరంగల్.

విద్యాలయాలలోవిద్యార్థులకు ముఖ్యంగా చిన్నపిల్లలకు ఒక విషయాన్ని అర్థం చేయించాలంటే కొన్ని 'దృష్టాంతములు' అనగా ఉదాహరణలు ఇవ్వడం వల్ల వివరంచాల్సిన విషయం సరిగా అర్థమవుతుంది.

మన భారతదేశచరిత్రలో ఒకొక్క మహనీయులు ఒక్కో విలువలకు దృష్టాంతంగా నిలిచిన మాట నిజం. ఆంగ్లేయుల కబంధ హస్తాలలోచిక్కుకున్న భరతమాత సంకెళ్లను విముక్తి కలిగించిన గాంధీజీ స్వాతంత్రసమరంలో ప్రాణ త్యాగానికి దృష్టాంతంగా నిలిచారు.

భార్య పిల్లలలను త్యజించి వైరాగ్యభావనను ఆధ్యాత్మిక క్రాంతిని,శాంతి యొక్క విలువను మానవాళికిఅందించిఉదాహరణ మూర్తిగా గౌతమబుద్ధుడు మనకు ఆదర్శంగా నిలిచారు. భక్తిభావాన్ని ప్రజలలో పులకరింప చేసి పిల్లల్లో కూడా దృష్టాంత ముగా భక్తప్రహ్లాదుడు, ధృవుడు వున్నారు. ఇలా ఎన్నో దృష్టాంతాలు మనం చూడవచ్చు.

ఇలాఎంతోమందిదృష్టాంతంగా నిలిచి సమాజాన్ని ధర్మంవైపు పయనించడంలో కృషి చేశారు. పరమపావనమైన పవిత్రతా సుఖశాంతుల శ్రేష్టసమాజానికి దుష్టాంతం సత్యయుగంలోని శ్రీ లక్ష్మీనారాయణులు. భిన్నత్వంలో ఏకత్వంగా విభిన్న ధర్మాలు, మార్గాలున్నప్పటికి వసుధైక కుటుంబంగా షోడశకళా పరిపూర్ణంగా విరాజిల్లిన సతోప్రధాన భారతావని బంగారు పిచ్చుకకు దృష్టాంతముగా నిలిచింది.

ద్వాపరయుగం వచ్చేసరికి అధర్మం అశాంతి దేహాభిమాన పోకడలు తొంగిచూడటంతో, ధర్మ పితలు, సాధు సన్యాసులు, ఋషులు దృష్టాంతముగా నిలిచి ధర్మాన్ని నిలబెట్టారు. ఒకేమాట ఒకేభాణం, ఏకపత్నీవ్రతంతో ఉదాహరణగా నిలిచిన శ్రీరాముడు మానవాళికిఆదర్శం. భాగవతంలో వస్తువైభోగాలతో, బంగారు ఆభరణాలతో కృష్ణున్ని తరాజులో తూచగలనని అహంభావానికి దృష్టాంతమైన సత్యభామ, పరిపూర్ణ భక్తురాలిగా తనువు, మనసు, ధనాలకు గుర్తుగా తులసీదళాన్ని అర్పించిన రుక్మిణీ భక్తమహిళా శిరోమణికి దృష్టాంతమయ్యారు.

యువకులకుఆదర్శంగా బ్రహ్మచర్యసాధనలో వుంటూ అమెరికా షికాగో మహాసభలలో సోదరీ సోదరులారా! అని సంబోధించిన ఉపన్యాసంతో సభాప్రాంగణం చప్పట్లతో మారుమ్రోగింది.

దుఃఖభరిత నేటి సమాజంలో ఈనాటికి మానవాళి బ్రతికి వున్న దానికి ఎందరో మహానుభావుల త్యాగ పురుషుల దృష్టాంతములే సత్యం. భారతదేశ చరిత్రలో ఇంకా పరిశీలిస్తే ఎందరో వెలుగులోకి వస్తారు. కుష్ఠురోగులకు, గుడ్డివారికి, కుంటివారికి, వికాలాంగులకు సేవలుచేసిన మహిళా శిరోమణి మదర్‌థెరిస్సా ఈనాటికి ఆదర్శంగా సేవాతత్పరత కలిగిన మాతృమూర్తిగా నిలిచారు. ఒక్కో గుణానికి ఒకొక్క మానవత్వపు విలువలకు దృష్టాంతములు వున్నాయి.

దృఢసంకల్పానికి గుర్తుగా రామాయణంలో హనుమంతున్ని

**కొంచెం ఆలోచించు !**

*భగవంతుని దృష్టి నీపై ఉంది....*
*అయితే నీ దృష్టి ఎవరిపైఉంది...*
*భగవంతుని వదిలి నీ దృష్టి*
*ఎక్కడికో ఎందుకు పోతుంది?*
*నీ తోడుగా ఉండి సహాయం*
*చేయుటకు వాగ్దానము*
*చేసిందెవరు...*

సమాధానం ఇదే సంచికలో...

చూపారు.నిరాకారుడు జ్ఞాన సాగరుడు, పతితపావనుడు పరం జ్యోతిర్బిందువైన పరమాత్మునికి సాకారంలో ప్రజాపిత బ్రహ్మాబాబా దృష్టాంతముగా నిలిచారు.

బ్రహ్మాబాబా ఓంమండలి ప్రారంభించిన తర్వాత ఎందరో ఓంమండలిని గిట్టనివారు చిత్ర ప్రదర్శినిని ఆహుతి చేసినప్పటికి సహనంతో భరించి సహనానికి మారుపేరుగా నిలిచారు.మరల కొత్తచిత్రాలు వస్తాయని సర్దు కునే శక్తితో ఇముడ్చున్నారు. తన కోట్లాది ధనరాశులతో ఈశ్వరీయ యజ్ఞాన్ని స్థాపించి నిమిత్తంగా మమ్మాను సమర్పించారు.

బెగ్గరిపార్ట్‌లోకూడాఈశ్వరీయ సేవలో స్వాహా అయిన త్యాగశీలి, మహిళా శిరోమణి,తపస్విని మన దాదీలు దృష్టాంతంగా నిలిచారు. త్యాగము, తపస్సు, సేవా తత్పరలకు బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఒకచక్కటి మార్గ దర్శియై దృష్టాంతంగా నిలిచింద నుటలో సందేహంలేదు. సత్యాన్ని గ్రహించిన ఐక్యరాజ్యసమితి యు. ఎన్.ఓ శాంతిదూత అవార్డును ఇచ్చి సభ్యత్వం యిచ్చారు.

అన్ని కోరికలు ఇచ్ఛామాత్రం అవిద్య చక్కటి ఔషధం. ఆకిలిగొన్న పావురానికి తొడను కోసిచ్చిన త్యాగశీలిశిబిచక్రవర్తి దృష్టాంతము అయితే, తన సర్వస్వము స్వాహా చేసిన దృష్టాంతము బ్రహ్మాబాబా.■

## కథామృతం



# వ్యర్థం

ఒక ఋషిదగ్గరికి జ్ఞాన ప్రాప్తి కోసం ఒక యువకుడు వెళ్ళాడు జ్ఞానం తీసుకున్న తర్వాత ఆ యువకుడు గురువుకు దక్షిణ ఇవ్వాలనుకున్నాడు. అప్పడాయన గురుదక్షిణగా ఈ ప్రపంచంలో అన్నింటికంటే వ్యర్థమైన వస్తువును ఇమ్మని అడిగాడు. శిష్యుడు గురువు ఆజ్ఞ అనుసారం అలాంటి వస్తువుని వెతకడానికి బయలుదేరాడు.

దారిలో వెళ్తూ వెళ్తూ మట్టిని చూశాడు.ఈ మట్టి ఏమిపని కొస్తుంది ఇదే అన్నింటికంటే వ్యర్థమైందని మట్టిని పట్టుకోబోయాడు. అప్పడామట్టి నువ్వునన్ను వ్యర్థమనుకుంటున్నావా? నీకుతెలియదు ఈ ప్రపంచంలోని అన్ని పదార్థాలు నా గర్భం నుండే ఉత్పన్నమవుతాయి. ఈ మొక్కలు రంగురూపు అన్నీ ఎక్కడ నుండి వస్తున్నాయి? అడిగింది. శిష్యుడు ముందుకునడిచాడు.

కొంత దూరం వెళ్ళిన తరువాత ఒకరాయి కనిపించింది శిష్యుడు దాన్ని తీసుకుందామను కున్నాడు. ఆ రాయిని తీసుకుందామనుకుంటే ఆ రాయి నువ్వింత జ్ఞానివై నన్ను పనికిరాదనుకుంటున్నావా? నువ్వు నీ భవనాలు ఎలా కట్టుకుంటావు? మందిరంలో దేవతామూర్తులు ఎలాతయారవుతాయి?ఇన్నిఉపయోగాలున్న నన్ను వ్యర్థమనుకుంటు న్నావా! అని అడిగింది. అదివిన్న శిష్యుడి దగ్గర ఎలాంటి సమాధానం లేదు.

ఆ యువకుడికి ఏదిచూసినా అన్నీ పనికొచ్చే వస్తువులే అని పించాయి. మట్టి, రాయి కూడా ఇంత ఉపయోగాకరమైనప్పడు ఇంక పనికిరానిది ఏముందని ఆలోచించసాగాడు. ఆయన మనుసులో నుండి ఈ సృష్టిలో ప్రతి వస్తువూ ఉపయోగకరమే. వ్యర్థం తుచ్ఛమైంది ఏమంటే ఇతరులను వ్యర్థమనుకోవడం, వ్యక్తిలోని అహంకారమే దేనికి పనికిరానిది వ్యర్థమైందనే ధ్వని వినిపించింది. ఆ యువకుడు తిరిగివెళ్ళి గురువుగారి కాళ్ళమీద పడి తన అహంకారాన్నే దక్షిణగా ఇచ్చాడు.■



# అలౌకిక అనుభవం



● బి. కె. నీలు బెహన్‌జీ, మౌంట్‌ఆబూ.

నేను చిన్నప్పటినుండి తల్లి దండ్రులతో మధువనం వచ్చేదాన్ని. సందేశిదాదీతో కలిసి మొదట మధువనంవచ్చాను. ఒక సారి ప్రకాశమణిదాదీజీ సందేశి దాదీతో ఈఅమ్మాయి గుల్జార్ దాదీజీతోవుంటారా అనిఅడిగారు. అపుడు సందేశిదాదీజీ ఆమె తల్లిదండ్రులనుఅడిగి చెబుతానని చెప్పారు.అప్పడు మాతల్లిదండ్రులు అంగీకరించలేదు. కాని నాకు ఈ అలౌకికజీవితం ఇష్టం గనుక నేను సమర్పితమవ్వాలనుకున్నాను.

ప్రకాశమణిదాదీనే నన్ను గుల్జార్‌దాదీజీతో ఈశ్వరీయసేవకై నిమిత్తంచేశారు. అప్పడు నా వయసు 14సంవత్సరాలు. నాకు ఏ విషయాలు తెలియవు. దాదీనే నాకు ప్రతివిషయం నేర్పించారు. ఎవరితో ఎలా మాట్లాడాలి, అందరితో సమూహంలో ఎలా వుండాలి ఇలా ప్రతిచిన్నచిన్న విషయాలు చెప్పేవారు.

1980-85నాటి విషయం బాబా వచ్చినప్పడు రాత్రంతా దాదీతోనే కూర్చునేదాన్ని ఎందు కంటే బాబా రాత్రంతా వుండేవారు. సాయంత్రం6.30నుండిఉదయం 4.30వరకు బాబా వుండేవారు. ఆ సమయంలో యజ్ఞానికి సంబంధించిన విషయాలు బాబాను అడగమని ప్రకాశమణిదాదీజీ చెప్పేవారు. బాబా అవ్యక్తభాష అర్థం చేసుకోవడంలో నాకెప్పడూ కష్టమనిపించలేదు. బాబాచెప్పే విషయాన్ని నేను అర్థంచేసుకుని ఆ తర్వాతరోజు దాదీజీకి చెప్పేదాన్ని చెప్పిన తరువాత ఆ విషయాలేవీ నా బుద్ధిలో ఉండేవికావు. బాబా తనపని చేయించుకునేవారు. తర్వాత నా బుద్ధిని క్లియర్ చేసే వారనిపించేది. ఈ విధంగా దాదీజీతో ఉండటం జరిగింది.

దాదీజీకూడా శరీరంతో ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారు. పెద్ద దాదీలద్వారా బ్రహ్మాబాబాగురించి విన్నాను. కాని నేను ప్రాక్టికల్‌గా దాదీజీస్థితి చూశాను. దాదీజీ చాలా గంభీరంగావుండేవారు. చాలాతక్కువ మాట్లాడేవారు. గంభీరంగావున్నాదాదీజీఎదురుగా ఎవరువచ్చినా వారు చాలా ఆనందాన్ని అనుభవం చేసుకునే వారు. ఎలాంటి సమస్యలతో వచ్చినా దాదీజీ దగ్గరికి రాగానే ఆ సమస్య శాంతమైపోయేది. వారేమి మాట్లాడలేకపోయేవారు. బాబాముందుకువెళ్ళగానే ఎవరికి ఎలాంటివిషయాలు గుర్తుండేవి కావు. బాబా చెప్పిందే గుర్తుండేది. అలానే దాదీజీ ముందుకు రాగానే సంతృప్తిపడివెళ్ళేవారు.

దాదీజీ బాబా దగ్గర నుండి చాలా శక్తినినింపుకుని వచ్చేవారు, అపుడు తేలిగ్గా అనుభవం చేసుకునేవారు.దాదీజిస్థితి సదా ఒకే విధంగా ఉండేది. ఎలాంటి చిన్న పెద్దవిషయాలు, పరిస్థితులు వచ్చినా దాదీజీ చాలా స్థిరంగా అచంచలంగా వుండేవారు. దాదీజీ సదా ఏం చేసినా బాబానే చేస్తారనేవారు. ప్రతి విషయంలో

### అతిమధురం

**మధురాతి మధురం మన మధువనం**
**శివబాబా మధురం బాబాజ్ఞానం మధురం**
**బాబా వినిపించె మురళి అతిమధురం**
**జ్ఞానం మధురం యోగంమధురం**
**ఆత్మలతో పరమాత్మని మిలనం అతిమధురం**
**ధరణిలోనికి బాబా రావడం మధురం**
**బాబాను కలిసే అమృతవేళ అతిమధురం**
**సత్యమైన తండ్రి సాంగత్యం మధురం**
**ఆ పరమాత్మని ప్రేమను పొందిన మనం ధన్యులం**
**ఆనందసాగరుని అమృతమయ జ్యోతి బిందుస్వరూపం**
**శివపరమాత్మ నిన్ను పొందిన మేము భాగ్యశాలి ఆత్మలం**




**- బి.కె. విజయలక్ష్మి, మోండామార్కెట్, సికింద్రాబాద్.**

బాబానే ముందుంచేవారు. బాబా, పెద్దదాదీ ఇద్దరుదాదీజీని నిమిత్తం చేశారు.అందరికిమనంసహయోగమివ్వాలి అనేవారు.

గుల్జార్‌దాదీజీకి ఎప్పుడూ నేను బాబా రథాన్ని, పెద్దదానిని ఇలాంటి ఆలోచనలు ఉండేవికావు. దాదీజీ మామూలుగా వున్నప్పుడు, బాబా వచ్చినప్పుడు చాలామార్పువుండేది. బాబా సర్వశక్తివంతుడు. దాదీజీ చాలా వినయంగా, నిస్సంకల్పంగా చిన్నపిల్లలా ఉండేవారు. బాబా వచ్చినప్పుడు ఆయన సర్వశక్తివంతుడు ఆ విధంగా శక్తిని ఉపయోగించేవారు.

జానకిదాదీజీ శరీరం వదిలినపుడు అందరూ ఈ విషయం దాదీజీకి చెప్పమని చెప్పారు. ఈ విషయం దాదీజీకి చెబితే నేను వతనంలో దాదీజీని చూశాను. దాదీజీ బాబా దగ్గరేవున్నారు అని అన్నారు. యజ్ఞంలో ఏం జరిగినా ముందే దాదీజీ తెలిసిపోయేది. దాదీజీకి అన్నీతెలుసు. కేవలం మేము రిపీట్ చేస్తున్నామని మాకు అనిపించేది.

దాదీజీ! మీరిప్పుడు యజ్ఞానికి చీఫ్ అయ్యారంటే చీఫ్ నేనుకాదు బాబాఅనేవారు.సదా బాబా!బాబా! బాబానే చేయిస్తున్నారు. బాబా ఏ సేవచెబితే అది చేస్తానుఅనేవారు. దాదీజీ అమృతవేళ, మురళీ ఎప్పుడూ మిస్ చేయలేదు. దాదీజీకి సందేశాలు వ్రాయడంలో ఎక్కువ సమయం పట్టేది. చిన్న పెద్దఅనికాదుఎవరు క్లాసుచేసినా దాదీజి తప్పకుండా వినేవారు.

31డిసెంబర్2017లో బాబా 'సమాప్తి సంవత్సరం' అని చెప్పారు. తరువాత మేము దాదీజీని ముంబాయి తీసుకెళ్ళాం. దాదీజీ తన ఆరోగ్యం సరిచేసుకున్నారు. 2016లో మేము అందరిని కలుసుకుని దీపావళి జరుపుకుని ఢిల్లీనుండి వచ్చేశాము. గామ్‌దేవీ సేవాకేంద్రంలో మేము మూడు సంవత్సరాలు ఉన్నాము. దాదీ ప్రతిక్షణం బాబాలానే అనిపించేవారు. ఎవరైనా దాదీగారినిచూడటానికి వస్తే వారికి దాదీగారి ముఖం దృష్టిచూస్తే బాబానే కనిపించేవారు, బాబానే చూస్తున్నారనిపించేది.

నేను వెంటవుండి బాబా, దాదీ ఇద్దర్నీ చూసేదాన్ని ఈ మూడు సంవత్సరాల్లో దాదీలా అనిపించేవారుకాదు. చాలా తపస్సులో నిమగ్నమై వుండేవారు. దాదీజీ ఆరోగ్యం గురించి డాక్టర్లు కలవడానికి వచ్చినపుడు వారు శాంతి, శక్తిని అనుభవం చేసుకునేవారు. దాదీజిని చూడ్డానికి డాక్టర్లు వస్తే దాదీజీ వారిని మీ మనసులో ఏమైనా ఆలోచిస్తున్నారా ఏదైనా విషయం వుందా అని అడిగేవారు. మేమైతే ఏం చెప్పలేదు. దాదీజీఎలా అడుగుతున్నారని ఆశ్చర్యమనిపించేది. దాదీ వారికి సలహా ఇచ్చేవారు.

ఒకడాక్టర్‌కి తనపోస్టుగురించి ఏదో చర్చనడుస్తుంది దాదీజి ఆ డాక్టర్‌కి మీరు చేసేకర్తవ్యంలో ఎలాంటి తేడాలేకుండా చేస్తూ వెళ్తే అప్పుడు తప్పకుండా సఫలత లభిస్తుందని చెప్పారు. ఆయన మాతో దాదీజిచెప్పినట్లే చేస్తానన్నారు. ఒకనెల తర్వాత అతనికి దొరకవలసిన పోస్టు దొరికింది. డాక్టర్ తనకులభించిన అవార్డులు అన్ని దాదీజీ దగ్గరకు తెచ్చి ఇదంతా మీవల్లే జరిగిందని చెప్పారు. ఈవిధంగా దాదీజీ ఎవరెవరి మనసులో ఏముందని గుర్తించేవారు.

మేము దాదీతోనే వుండేవాళ్ళం. ఏదైనా మాట్లాడినా అడిగినా దాదీజి ఒకే విషయం చెప్పేవారు. ఇప్పుడు సమయం చాలా తక్కువగా వుంది యోగంచేయండి. ప్రతీకర్మలో శ్రద్ధ వుండాలనేవారు.



నిజం చెప్పడానికి ఎంతో ధైర్యంకావాలి. అలాగే నిజం ఒప్పుకోవడానికి కూడా అంతకుమించిన ధైర్యం వుండాలి.

- విద్యాప్రకాశనందగిరి స్వామి.

కరోనా రాకముందే సమయం ఎలా వస్తుందంటే మనం బయట క్కూడా వెళ్ళలేము అని చెప్పారు. ఇలాంటి వైరస్ వస్తుందని అప్పుడు మాకుతెలియదు. ఇలా జరగబో తుందని దాదీజీకి ముందే తెలిసి పోయి మాకు ముందే చెప్పేవారు. దాదీజీకి అనారోగ్యంవుంది కాని దాదీవేరు, ఆవిడ శరీరం వేరు అనిపించేది.

శరీరానికి ఇవ్వవల సిన ట్రీట్‌మెంట్ డాక్టర్లు చేస్తుంటే దాదీజీ ఏం మాట్లాడేవారుకాదు. డాక్టర్ల పని డాక్టర్లది, నా పనినాది అనేవారు. శరీ రానికి అతీతంగా వుండే వారు. దాదీజీ శరీరం వదిలి పెట్టడానికి ఒకటి రెండు నెలల ముందు నుండే మాటలు చాలా తగ్గించారు.

దాదీజీ సైలెన్స్‌లో వుంటే నయనాల భాష తోనే అర్థంచేసుకునేవాళ్ళం. దాదీజి కళ్ళతోనే మాట్లాడేవారు.

బాబా వచ్చినపుడు కూడా తన కళ్ళతోనే ఎవరికి ఏదివ్వాలి అన్ని విషయాలు చేప్పేవారు. నాకన్నీ అర్థమయ్యేవి. బాబాకు చెప్పవల సిన అవసరం వచ్చేదికాదు. చివరి సమయంలో దాదీజిది కూడా అదే స్థితి. దాదీజీ తన కళ్ళతోనే ఇది చేయాలి,ఇదివద్దుఅని చెప్పేవారు. దాదీజీ తనకళ్ళతోనే మాట్లాడు తున్నారని డాక్టర్లకూ్కడా అర్థ మయ్యేది. దాదీజీకి విషయం సరిగ్గా లేదనిపిస్తే కొంచెంసేపు దృష్టినిచ్చి కళ్ళు మూసుకొనేవారు.

*ప్రస్తుత ప్రపంచంలో వివిధ మన స్తత్వాలు, అలవాట్లతో ఉన్న వ్యక్తులు ఉంటారు. ప్రతిఒక్కరూ వారివారి భావాల అనుసారంగా నడుచుకుంటున్నారు అని అర్థం చేసుకుంటే మీ మనసు బాధపడదు. మీరు మార్చాలనుకున్నవ్యక్తి మీరుఎంత ప్రయత్నించినా అంత సులువుగా మారలేదు, ఎందుకంటే అతనిలో ఆ సంస్కారం బాగా నాటుకుపోయిందనిఅర్థం. మీలో కూడా అసంతృప్తిచెందే గుణం ఎక్కువగాఉంది కాబట్టే గుణాన్ని మీరెందుకు వదలిపెట్టకూడదు? మీలో కూడా త్వరగా మారని కొన్ని గుణాలు ఉన్నాయా లేవా అని మిమ్మల్నిమీరు ప్రశ్నించుకోండి. ఇలాంటి దృష్టికోణంతో చూసినట్లయితే మీకు ఎవరిపైకూడా నకారాత్మక భావన ఉత్పన్నంకాదు.*



**– రాజయోగి అమీర్‌చంద్ భాయ్‌జీ.**

అపుడు మాకు ఇది సరికాదని అర్థమయ్యేది. దాదీజీ దృష్టి చాలా శక్తిశాలిగా వుండేది. ఎవరైనా తప్పచేస్తే వారికి మేము తప్ప చేస్తున్నామని అర్థమైపోయేది. డాక్టర్లవల్ల ఏదైనా తప్ప జరగుతు న్నాకాని దాదీజీ దృష్టిఇచ్చేవారు, వారు ఇది సరికాదని స్వయంగా నిర్ణయం తీసుకునేవారు. జ్ఞాని అజ్ఞాని ఎవరైనా వారిపై దాదీజీ దృష్టి ప్రభావం పడేది. దాదీజి ప్రతి అడుగులో బాబాను అడిగిచేసే వారు. హాస్పిటల్‌వారుకూడా ఈమెలో గొప్పశక్తివుంది అనే వారు. డాక్టర్లు 10నిమిషాల కోసమనివచ్చేవారు గంటలు కూర్చునేవారు. ఇక్కడకు వస్తే చాలా శాంతి అనిపిస్తుంది. మాలో ఇక్కడనుండి చాలా శక్తి వస్తున్నట్లు అనిపిస్తుంది. అనేవారు.

దాదీజీ వైబ్రేషన్స్‌ని నలు వైపులా వ్యాపింపచేసేవారు. బాబా ఒకసారి డైమండ్ హాల్లో ముందు ముందు చిత్రం,చరిత్ర సేవచేస్తాయని చెప్పారు. దాదీజీ మీరు రాకపోతే మధువన్‌కి ఎవరు రారు, మధువన్ వెళదాం అంటే మధువన్ మధువనే. బాబా బాబానే. బాబానే అంతాచేస్తారనేవారు. యజ్ఞం ఎలా నడుస్తుందని సంకల్పం లేదు. బాబా నడిపిస్తారనే నిశ్చయంతో నిశ్చింతగా వుండే వారు. దాదీజీ మీకేమి సంకల్పాలు రావా? అని అడిగితే నా ప్రపంచం బాబా, నా సంస్కారాల్లో కూడా బాబానే అనేవారు.

దాదీజీ నన్ను బాబా నీవెంటే వుంటారని పక్కాచేయించేవారు. బాబా,దాదీ ఇద్దరూ నావెంటే వుండి నడిపిస్తున్నారు.■

# ఆత్మహత్య సమస్యకు సమాధానమా ?

ప్రస్తుతసమయంలోఆత్మహత్య సాధారణ విషయంగా మారింది. ఏదోఒక ఆత్మహత్య కబురు రోజూ వార్తాపత్రికల్లో వస్తూనే వుంటుంది. ఒక రిపోర్టు ననుసరించి ప్రపంచంలో ప్రతి సంవత్సరం షుమారు ఎనిమిది లక్షలనుండి పదిలక్షల మంది ఆత్మహత్య చేసుకుంటున్నారని. వీరిలో ఎక్కువగా యువత జీవితంలో ఓడిపోయి జీవితాన్ని అంతం చేసుకుంటున్నారని తేలింది.

ఆత్మహత్య చేసుకునేందుకు కారణం ఏమిటి? మనుషులు ఎక్కువగా సంబంధాలలలో పరివారంలో సామాజిక ఒత్తిడి, ఆర్థిక బాధలు, అవమానం, ఉదాసీనత, డిప్రెషన్ మరియు ఓటమి వలననే ఉత్పన్నమైన సమస్యలలో చిక్కుకొనిమానసికసమతుల్యతను కోల్పోయి నిమ్న భావనలకులోనై ఆవేశంలో జీవితాన్ని అంతం చేసుకుంటున్నారు. కాని ఈ సమస్యలన్నిటికీ ఆత్మహత్యయే సమాధానమా?

నిజానికి ఆత్మహత్యఅనే మాటే తప్పు. ఎందుకంటే ఆత్మను హత్య చేయడం వీలుకానిపని. దీనిని దేహహత్య, జీవహత్య అనవచ్చు. మృత్యువు ఒక ధృడమైన సత్యం అనేది అందరికీ తెలుసు. జీవిత మనే యాత్రకు అంతిమ మజిలీ లేక చివరిగమ్యంమృత్యువు. జనన మరణాల మధ్యనున్న యాత్రయే జీవితం. కర్మక్షేత్రంలో మంచి కర్మలుచేసి మనం రాబోవు జన్మ సహజంగా సుఖాన్నిచ్చేదిగా చేసుకోగలం. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి కేవలం ఈ జన్మను పాడుచేసుకోవడమేకాక రాబోవుఎన్నో జన్మలకుకూడా గ్రహణం పట్టించుకుంటాడు. ఈశోపనిషత్తులో ఆత్మహత్య చేసుకునే వ్యక్తిని దుష్టునిగా అంటే చనిపోయిన తర్వాత అంధకారంతో నిండిన సూర్యుని వెలుతురు లేని లోకానికి వెళ్తాడని చెప్పబడింది.

వ్యక్తి తనజీవితంలో ఒకేసారి ఎన్నో పాత్రలు పోషిస్తాడు. ఉదా: తల్లి లేక తండ్రి, సోదరుడు లేక సోదరి, భర్త లేక భార్య, కొడుకు లేక కూతురు మొదలైనవి. వ్యాపారం లేక వ్యవహారంలో కూడా వేరువేరు పాత్రలుంటాయి. యజమాని లేక నౌకరుమొదలైనవి. ఒకవ్యక్తి ఆత్మహత్య చేసుకున్నపుడు అతని జీవితంతో ముడిపడిన సంబంధాలన్నిటిపై చాలా చెడు ప్రభావం పడుతుంది. ముఖ్యంగా అతనిపై ఆధారపడిన వారిపై స్వతహాగా వ్యక్తిమరణం అతని పరివారానికి దుఃఖాన్ని కలుగజేసే విషయమే అవుతుంది. కాని ఆ మృత్యువు, ఆత్మహత్య అతనిదే. దానిప్రభావం ఇంకా ఎక్కువగా వుంటుంది. జీవితాన్ని సమాప్తం చేసుకోవడంవలననే సమస్యలన్నీ సమాప్తమవుతా యనుకుంటాడు వ్యక్తి. కాని ఇది పొరపాటు ఎందుకంటే సమస్యలు అచటనే వుంటాయి.

కొందరు తమ రంగాలలో విజయం పొందికూడా ఆత్మహత్య చేసుకున్న వార్తలు విన్నాం. వారికి ఎలాంటి ఆర్థికబాధలతో పోరాడవలసిన పనికూడాలేదు. అందువలన మనుషుల ఆర్థికబాధల వలన లేక ఓటమివలన చేసుకుంటారనేది పూర్తిగా పొరపాటు. అందువలన ఆత్మహత్య చేసుకునే వ్యక్తి భయస్తుడు లేక బలహీనుడే ఆత్మహత్యకు పాల్పడతాడనేది కూడా ఒకోసారి పొరపాటే అనిపిస్తుంది.

తమ ధృడమైన కోరికయనే శక్తితో సమస్యలకు సమాధానం వెదకడమే కాక దానిని ఒక అవకాశంగామార్చుకొని పేరుపొందిన వారు ప్రపంచంలో అనేకమంది ఉన్నారు. పరీక్షలలో ఫెయిల్ అయిన విద్యార్థులు ఆత్మహత్య

చేసుకుంటారు. కాని పరీక్షలలో అనేకసార్లు ఫెయిలైన విద్యార్థులు అందరితో నిందలు ఎదురుర్కొన్న ఆటగాళ్ళు చాలామంది వున్నారు. కాని ఆత్మహత్య చేసుకోలేదు. చదువులో బలహీనులైనవారు ఆటలలో శ్రమపడి విశ్వంలో పేరు ప్రతిష్టలు పొందిన వారున్నారు. వ్యాపారంలో అనేకసార్లు నష్టపోయినాకూడా ప్రతిసారి మరల ప్రయత్నంతో విజయంపొందినా ఓడిపోయినా తమ ప్రయత్నాలను వదిలపెట్టరు.జీవితం అందమైనది, కేవలం జీవించడం నేర్చుకోండి.

ప్రపంచంలో చిన్న పెద్ద సమస్యలు ఎదుర్కోని వ్యక్తులెవరూ బహుశ ఉండిఉండరు. పరిస్థితులు మనకు కొంతనేర్పించి శక్తివంతంగా చేస్తాయి. ప్రతి సమస్య ఒక చక్కని అవకాశం దానిని దాటితే ఇంకా ఎక్కువప్రేరణ లభిస్తుంది. దీనికి విరుద్ధంగా కొందరు సమస్యలను పర్వతంగా భావించి పరిస్థితులను ఎప్పటికీ పూర్తికాని సముద్రంలా భావిస్తారు. ఒకసారి చనిపోయేందుకు నిర్ణయించుకున్నపుడు వారిలో సమస్యలనెదుర్కొనే శక్తి వుండదు. జీవితంతో నిరాశచెంది వారు మృత్యువును ఏకైక అంతిమ, సహజమైన సరళమార్గంగా భావిస్తారు. .

కష్టాలనుండి పారిపోవడం తేలిక. ప్రతి పార్శ్వం జీవితంలో పరీక్షవుతుంది, భయపడేవారికి జీవితంలో ఏమీ లభించదని, పోరాడేవారికిఅడుగడుగునాపూర్తి ప్రపంచం వుంటుందంటారు.

ఆత్మజ్ఞానియైన వ్యక్తి ఎపుడూ ఆత్మహత్యచేసుకోడు, బహుశ మనుషులు ఆత్మ,శరీరాన్ని ఒకటిగా భావించి శరీరాన్ని నాశనం చేసుకోవడంవలన జీవితం నాశనమవుతుంది. ఆలోచించక చెడుకర్మలుచేస్తారు.కాని నిజానికి శరీరం నాశనమైనప్పటికీ ఆత్మ వృద్ధాప్యం, మరణంలేని అవినాశి వస్తువు. ఆత్మ ఒక శరీరం వదలి వేరేశరీరంలోప్రవేశించి ఆయువు పూర్తి చేసుకొని శరీరాన్ని వదలి మరల కొత్తజన్మ తీసుకుంటుంది.

జనన మరణాల ఈ ప్రాకృతిక ప్రక్రియలో ఆత్మ ఒక శరీరం వదలినపుడు కర్మలననుసరించి మరో శరీరం మొదటినుండే తయారై అందులో ఆత్మ ప్రవేశిస్తుంది. కాని ఆత్మహత్య వలన జరిగిన మృత్యువుతో ఆత్మ తన సమయచక్రము పూర్తయ్యేంత వరకూ భ్రమిస్తూ వుంటుంది.

జీవితం పరమాత్మ ఇచ్చిన బహుమతి.అందువలన ఆత్మహత్య పరమాత్మకు ఆయన సృష్టియైన ప్రకృతికి ఘోర అవమానం. ఇది పాపమేకాక మహాపాపం. ఆత్మహత్య చేసుకునేవారికి చాలా కఠినమైన శిక్ష లభిస్తుంది. ఈ మహాపాపంనుండి రక్షించుకునే ఏకైక ఉపాయం పరమాత్మను స్మరించడం. ప్రతికర్మకు ముందు ఆయనను గుర్తుచేసి ధన్యవాదాలు చెప్పాలి. పరమాత్మను గుర్తుచేసేవ్యక్తి ఆయనపై సంపూర్ణ విశ్వాసముంచి పరమాత్మ చెప్పేది మంచికోసమేనని అంగీకరించి ప్రతిపరిస్థితిని సంతోషంగా స్వీకరిస్తాడు.

పరమాత్మను తోడు చేసు

***ఏది నీ సొంతం?***

దాచిపెట్టిన ధనం పరుల సొంతం
అందమైన దేహం అగ్ని సొంతం
అస్థికలన్ని గంగ సొంతం
కొడుకు పెట్టిన తద్దినం కాకుల సొంతం
ఇష్టంగా వాడిన వస్తువు వేరొకరి సొంతం
ఇన్ని సంవత్సరాలు నీతో ఉండే దేహం కాదు నీ సొంతం
చేసిన పుణ్య ఫలం నీ సొంతం
తెలిసో తెలియకో చేసిన పాపఫలం నీ సొంతం
ఆత్మల తండ్రి పరమాత్మ నీ సొంతం
ఇది అర్థం చేసుకొన్ననాడు అనంతమైన ప్రాప్యలు నీ సొంతం



**- బి.కె. శివప్రియ, బొబ్బిలి, విజయనగరం.**

కోవడంవలన ధైర్యం, సామర్థ్యంతో పాటు పరిస్థితులను ఎదుర్కొని వాటిపై విజయంకూడా పొంద గలరు. ఈశ్వరుని గుర్తుచేయడం వలన మనసులో నిరాశ ఎప్పడూ రాదుఆశతోకూడినఉత్సాహంఏర్పడు తుంది. పరమాత్మపై సంపూర్ణ నిశ్చయంతో ఈ మహాపాపం నుండి రక్షించుకోవచ్చు.

చనిపోయిన తర్వాత ఆత్మ యొక్కస్థితి తన జీవితకాలంలోని పాపపుణ్యాలను అనుసరించి వుంటుంది.అంతిమసమయంలో 'ఎలాంటిస్థితివుంటుందో అలాంటి స్థితి' ఉంటుందని అంటారు. భగవద్గీత ఎనిమిదవ అధ్యాయం ఐదవ శ్లోకంలో అంతిమ సమయంలో చింతన యొక్క మహత్వంగూర్చి చెప్పబడింది'అంతిమసమయంలో నన్నుగుర్తుచేస్తూ దేహత్యాగం చేసినవారు సాక్షాత్తు నా గుణాలనుపొందుతారని' చెప్పబడింది.

ఆత్మహత్య చేసుకునే వ్యక్తి ఆవేశంలో వచ్చి నిర్ణయం తీసుకుంటే అంతిమసమయంలో అతడు జీవించేందుకు తపించి సంఘర్షణలో పడతాడు. దీనివలన అతని ఆత్మ చనిపోయిన తర్వాత కూడా ముక్తి పొందలేదు. సూక్ష్మశరీరంలో ఉండి బాధలు సహిస్తుంది. నిజానికి మనసులో ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన రావడం వికృతమైన మానసిక స్థితికి ఒక రూపం. దీనవలన తనపై తనకు నియంత్రణ లేక మనసులో మాటి మాటికి తనను తాను చంపుకోవాలన్న ఆలోచన వస్తుంది. అలాంటి ఆలోచనలు నిరంతరం వస్తూ వస్తూ ఆ ఆలోచనలకు వశమై ఒకరోజు అజ్ఞానంతో అలా చేస్తాడు. దీనినుండి రక్షించుకునే కొన్ని సహజమైన ఉపాయాలను అనుసరించడం వలన అలాంటి పాపకర్మనుండి రక్షించుకోచ్చు.

**1.**మానసిక స్థిరత్వం లేనందు వలన వ్యక్తి ఆలోచనాశక్తిని పోగొట్టుకుంటాడు. మంచి చెడుల భేదాన్ని తెలుసుకోలేడు. అలాంటపుడు రాజయోగసాధన చాలా లాభాన్నే కలుగజేస్తుంది. రాజయోగసాధనవలనమనసులో ఏకాగ్రతాశక్తి, నిర్ణయశక్తి, పరిశీలనాశక్తి పెరిగి వ్యక్తి తగిన నిర్ణయం తీసుకోగలడు.

**2.** మీ జీవితం యొక్క గొప్పతనాన్ని గ్రహించండి. జీవితం అమూల్యమైనది, దీనిని చక్కగా తెలుసుకొని సమస్యలలోనిగ్రహాన్ని కోల్పోకండి.

**3.**ఈప్రపంచంలో ప్రతివస్తువు పరివర్తనఅయ్యేదే. పరిస్థితులు కూడా ఎల్లప్పటికీ ఒకేలా వుండవు మారుతాయి. కావున విపరీత పరిస్థితులలో కూడా అనుకూల పరిస్థితులకైఎదురుచూస్తూమిమ్మల్ని మీరు నియంత్రించుకోండి.

**4.**భావనలు ఎల్లప్పడూ ఒకే రీతిగాఉండవు మారుతుంటాయి కావున భావనలపై నియంత్రణ ఉండాలి.

**5.** జీవితంలో ఆనందప్రదమైన క్షణాలను గుర్తుచేసుకొని వాటిని మరల జీవితంలోపొందే ప్రయత్నం చేయండి.

**6.** అలాంటి సమయంలో ఎవరైనా ఆధ్యాత్మికవ్యక్తి సాంగత్యం చేసి వారితో జ్ఞానచర్చ చేయండి. జ్ఞానంతో మనోనేత్రాలు తెరుచుకొని మనసు ఈశ్వరీయ ప్రేమలో మునిగిపోతుంది.

**7.**ప్రేరణనిచ్చే పుస్తకాలు చదవండి. వాటిప్రేరణతో మనసును బిజీ చేసుకోండి. మంచి మిత్రుల సాంగత్యం చేయండి.

**8.** మీకు మీరే టీచర్లై, మీతో మీరు మాట్లాడుకోండి, పరోపకార పనులు చేయండి. స్వయాన్ని అర్థం చేసుకొని మిమ్మల్ని మీరు ప్రశంసించుకోండి.

**9.**ఈశ్వరునిపై మీ నిష్టను స్థిరముగాఉంచండి. ఆయనతో సామీప్యతను అనుభవం చేసుకోండి. ఆయనపై పూర్తి విశ్వాసం ఉంచి మీ స్నేహితునిగా ప్రతి దృశ్యాన్ని సాక్షియై చూడండి.

**10.**కర్మల గుహ్యగతిని చక్కగా అర్థంచేసుకొని అనేకజన్మలఋణ ఖాతాలు తెలుసుకొని మీ కర్తవ్యాన్ని నిర్వర్తించండి.

**11.**జ్ఞానియైనవ్యక్తితో మనసులోని విషయానిచెప్పి వారి సలహా తీసుకోండి.■



# సంకీర్ణశక్తి

● బి.కె.క్రిష్ణ, మోండామార్కెట్, సికింద్రాబాద్.

సంకీర్ణశక్తి అనగా ఇముడ్చుకోవడం. భగవంతుడు ఈ సృష్టిలో ఎన్నోజీవుల్ని మనకు ఉదాహరణగా నేర్చుకోవటానికి సృష్టించాడు. ఉదా: తాబేలు. ఇది అవసరమున్నపుడే తన అవయవాలను ఉపయోగించి తర్వాత వాటిని ఇముడ్చుకుంటుంది. దీనినే సంకీర్ణశక్తి అంటారు.

సమయం ఎంతో విలువైంది అందుకే చాలామంది నోటినుండి టైంలేదు,రాలేను,చాలా పని వుందని అంటుంటారు. మనిషిలో ఈ సంకీర్ణశక్తి వున్నపుడే పనులన్నీ సకాలంలో జరుగుతాయి. టైం అంటే మనీ కూడా మిగలుతుంది. మరి ఈ సంకీర్ణశక్తి మనకు రాజయోగసాధన ద్వారా లభిస్తుంది.

ఏదైనా విషయం విస్తారంలోకి వెళితే అనేక సమస్యలు, బాధలు, కొట్లాటలు, సారంలోకి వెళితే సమాధానం దొరికి సమయం మిగులుతుంది. తొందరగా పరిష్కారం కూడా అవుతుంది.

ఉదయం లేచినప్పటినుండి మనిషి రాత్రివరకు పరుగులు పెడుతూ వుంటాడు. ఇంటికి వచ్చేసరికి అలసిపోతాడు కాని కొద్దిసమయం కోసమైనా విస్తారమైన ప్రాపంచిక విషయాలను మరిచిపోయి స్వయం ఆత్మ యొక్క శక్తులైన మనసు, బుద్ధిని పరమాత్మపై కేంద్రీకరిస్తే మనసుకు నిజమైన శాంతి అనుభూతి అవుతుంది. దీనినే రాజయోగ సాధన అంటారు. దీనితో అష్టశక్తులలో ఒకటైన 'సంకీర్ణశక్తి' భగవంతుని ద్వారా మనకు లభిస్తుంది.

నేటి ప్రపంచంలో సైన్స్ ఎంతో అభివృద్ధిచెందింది ప్రతీవస్తువును సూక్ష్మంగా తయారుచేసి శక్తివంతంగా చేస్తోంది. ఒకప్పుడు దూరంగావున్నవాళ్ళతో మాట్లాడాలంటేల్యాండ్‌ఫోన్, సమాచారాన్ని పేపర్‌రూపంలో పంపాలంటే ఫ్యాక్స్‌ద్వారా, డబ్బు పంపాలంటే బ్యాంక్‌ద్వారా, వార్తలు వినాలంటే రేడియో ఇలా ఒక్కో అవసరాన్ని బట్టి ఒక్కోవస్తువును వాడేవారు, సమయం కూడా చాలా పట్టేది. కాని ఇప్పుడు స్మాట్‌ఫోన్ వచ్చిన తర్వాత ఇవన్నీ ఖర్చులేకుండానే క్షణాల్లో పనులు జరిగిపోతున్నాయి. ఇదంతా ఎలా సాధ్యంఅంటే సైన్స్ విస్తారాన్ని సారంలోకి తీసుకువచ్చింది.

ఎంతగా విస్తారంనుండి సారంలోకివస్తామో అంతగా శక్తివంతం, సమర్థవంతంగాను అవుతాము. రాజయోగసాధన చేస్తూవుంటే ఎలాంటి స్థితిలోనైనా సంకీర్ణశక్తిని ఉప యోగించి విస్తారంలో వున్న విషయాలన్నింటికి ఫుల్‌స్టాప్ పెట్టగలం. ఈ శక్తితోపాటు సమయం కూడా వృధాకాదు. సమయం కూడా ఒక సంపదలాంటిది, సమయం వృధా కావద్దంటే రాజయోగ సాధన చేయాలి.

మనం అవసరమున్నంత వరకు మన ఇంద్రియాలను ఉపయోగించాలి.మిగతాసమయంలో మనసులో జ్ఞానచింతన చేయాలి.

ఇపుడు మనందరి తండ్రి పరమాత్మ ఈ భూమిపై అవతరించి మానవాత్మలమైన మనందరిని పరంధామానికి రమ్మంటున్నాడు. ఐదువేల సంవత్సరాలనుండి విశాలమైన ఈ సృష్టినాటకంలో పాత్రను నటిస్తున్నాము, ఈ అనంత నాటకం పూర్తిఅయింది. దానికోసమే రాజయోగ సాధన నేర్పిస్తున్నాడు. రాజయోగంతో సంకీర్ణశక్తిని పొంది జీవితం సంతోషంగా తయారు చేసుకోవాలి.■



ఈ దేహాన్ని ఒక *నీటిబుడగ* లా చూసేవారిని మృత్యువు భయపెట్టలేదు.

- వినోబాభావే.

జ్ఞానామృతం పుస్తకాలు ఎన్నికావాలో తెలుపగలరు

చందాదారులుగా చేరదలచుకున్నవారు తమ చందాలను **30 ఏప్రిల్ 2022** లోపల మనియార్డరు / డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా **GYANAMRUTHAM** పేరిట మాత్రమే పంపగలరని మనవి.

**సంవత్సర చందా : రూ.100/-**

మా చిరునామా:
ప్రజాపిత బ్రహ్మాకుమారీస్
ఈశ్వరీయ విశ్వ విద్యాలయం
7-1-406, మోండా మార్కెట్ ఎదురుగా,
సికింద్రాబాద్ 500003.
ఫోన్: 9676801010

★ 23 వ పేజి తరువాయి....

నింద

ఇతరులకు గౌరవాన్నిస్తూ వారి గుణాలనుకూడా దృష్టిలో ఉంచుకొని ఎంతఉచితమో, ఏది ఉచితమో అదే చెబుతాడు. అతని మనసులోని భావాలను ఇతరులతో చెప్పడం లేక అతని పనిలోని లోపాలనుచెప్పితను ఆనందించక సహయోగియై స్నేహాన్నిస్తూ మేలు కల్గించే మాటలే చెబుతాడు.

**దేశకాలాలు**

ఇతరుల మంచికోసం, వారి ఉన్నతియొక్క భావంతో అతని లోపాలను వర్ణించడమనేది స్థానం, సమయం మరియు తన ప్రసంగాన్ని ధ్యాసలో ఉంచుకునే చేస్తాడు. అతడు ప్రతిదినం అన్ని చోట్లాఅవసరంలేకుండా వ్యర్థంగా నియంత్రణలేని మాటలు మాట్లాడడు. అతనికిగౌరవం ఇప్పించవలసినచోట గౌరవాన్ని పెంచేలా కూడాచేస్తాడు. లోపాలు చెప్పవలసినచోట చెబుతాడు కూడా.

ఒకవేళ అతని మానసికస్థితి పాడవుతుందనుకున్నపుడు లోపాలను చెప్పక శాంతంగా ఉండి తన మనసులో అతని గురించి ఎలాంటి భావనఉందో కూడా తెలియనివ్వడు. గంభీరతయనే దివ్యగుణాన్ని వదిలిపెట్టడు. అనుకూల పిరిస్థితులేర్పడినపుడే ఆ వ్యక్తి లోపాలనతనికి చెబుతాడు.

**వ్యక్తి**

అతడు ప్రతిఒక్కరికీ వారి లోపాలనుచెప్పడు. సహృదయతతో లోపాలున్న వారికే చెబుతాడు. ఎవరికైతే తను నేర్పించాలనుకుంటాడో లేక తనకన్నా పెద్దవారిలో లేక కార్యవ్యవహారాలలో సంబంధంఉందో వారికే వారి లోపాలను కూడా ఆ పని సరిగా జరిగేందుకే చెబుతాడు. పదిసార్లు చెప్పినా కానీ చెడు అలవాటును వదలనిచోఅతనినిసరిదిద్దేందుకు కొందరు స్వంతవారి ముందు కూడా అతని తప్పను చెప్పవలసి వస్తుంది. కాని అపుడు కూడా మంచిగా మేలు కలిగించేలా అహంకారంలేకుండా ఉండాలి.

ఒకవేళ ఎవరైనా అహంకారం, ఈర్ష్య,ద్వేషం,అసహ్యంతో నిండిన మాటలలో నిగ్రహాన్ని క్రమశిక్షణను వదిలి చెడుగా కేకలువేస్తూ అవమానించే భావనతో సందర్భం లేకుండా అర్థంలేకుండా ఇతరులనునిందిస్తుంటేఅతడుమాయకు వశమై తనపాపాన్ని పెంచుకుంటూ తనకర్తవ్యాన్ని నిర్వర్తించక చెడు చేస్తున్నాడని భావించాలి. అతడు విమర్శించే వాడుకాదు, నిందించేవాడు, సూక్ష్మదృష్టి కలవాడుకాదు, మాయ నిద్రలో నిద్రించి దుర్గుణాలను లెక్కిస్తూ పరులను నిందచేసేవాడిగా అనుకోవాలి.■

**అంతరంగం శీర్షిక**

పాఠక మహాశయులకు విజ్ఞప్తి!

ఈ ప్రక్కన ఇవ్వబడిన రెండు విషయాలలో ఏదేని ఒక విషయం గురించి మూడు (3) పేజిలు మించకుండా ఒకవైపు మాత్రమే విషయాన్ని అర్థవంతంగా గ్రహించి, జ్ఞానయుక్తము మరియు స్పష్టమైన అక్షరాలతో మనోరంజకంగా వ్రాసి 'అంతరంగం శీర్షిక' పేరుతో పంపగలరని కోరుతున్నాం. మీరు పంపిన వాటిలో ఆమోదయోగ్యమైన వ్యాసము ప్రచురింపబడుతుంది. కావున అందులో మీ పేరు, చిరునామా, సేవాకేంద్రం, పూర్తి వివరాలు, ఫోన్ నెంబర్‌తో సహా పంపగలరు. మీ వ్యాసాలు తిరిగి పంపబడవు.

వీటిపై తుది నిర్ణయం ప్రధాన సంపాదకులదేనని గమనించగలరు.

**విషయములు**

1. నేతృత్వం.
2. తెగులు.

సూచన: తేదీ 01-05-2022 లోపల చేరుకొన్న వ్యాసాలు మాత్రమే స్వీకరించి, ప్రచురింపబడునని పాఠకులు గమనించగలరు.

### రారాజు

వజ్రాల వ్యాపారి లేఖరాజుగారు
రాజుకారు సుగుణాల రారాజు
శ్రీకృష్ణ తుదిజన్మ సత్యయుగ తొలియాకు
పరమాత్ముడేదోలు దివ్యరథమూ
జగదంబ మాయమ్మ ఆమెపేరు మమ్మా
వాగ్దేవి శారద జ్ఞానపూర్ణాస్త్రాల
శక్తిని ఇలను చాటిన ధీశాలి
దుష్ట గుణముల దునుము భద్రకాళి
అమృతోత్సవమంటి అరుదైన సమయమిది
మనవాళ్ళ త్యాగాల తపసు ఫలమూ
స్మరియించి తరియించి ఆ రీతి వర్తించి
జాతి ఖ్యాతిని మెండు జేయుమిపుడూ
ఆధ్యాత్మికతకన్న గొప్పభావము మిన్న
మనదేశ దానమే జగతికంతా
సున్నాను ఇచ్చారు చదరంగమాడారు
ఇంతజేసి అంత మరచినారు
పదుల కొలది నదులు ఫలపుష్ప వృక్షాలు
ఘనమైన ఖనిజాల గనుల నెలవు

- బి.కె. శ్యామ్‌మనోహర్ , విజయవాడ.

### నా సర్వం బాబానే


అందరికన్నా అందమైన అందగాడు కానీ అందనే అందడు
అద్భుతమైన సద్గుణాల సాగరుడు, సర్వశక్తివంతుడు
అనాది అవినాశి  చైతన్యమైనవాడు
కోటీశ్వరుడు కోటివెలుగుల తేజస్సు కలవాడు
ఉన్నతోన్నత పరంధాముడు పరంజ్యోతి బిందుస్వరూపుడు
నిత్య సత్య జ్ఞాన సంపన్నమైన నా పరమాత్ముడు
పట్టుకుందామంటే చిక్కడు మరి దొరకడు
అన్నీ తెలిసినా తెలియనట్లు ఉంటాడు
తెలివిగా అన్ని చెప్పమంటూ ఆశోచతను అంటాడు
నాకు కావాల్సింది నా కన్నులముందు ఉంచుతాడు
నాకన్నా నా గురించి ఎక్కువ ఆలోచించి
నాతో అన్ని చేయిస్తాడు
గుప్తంగా  ఉంటూ దాగుడు మూతలు ఆడుతాడు
సమయానికి అండదండగా అంగరక్షకుడు అవుతాడు
ఆపదలో ఉన్నపుడు ఆపద్బాంధవుడవుతాడు
నువ్వు కనుపాప అంటూ కంటికి రెప్ప అవుతాడు
నా కన్ను నన్నుమోసంచేయకుండా సైనికుడవుతాడు
ధర్మరాజును అంటూ చెడుకర్మలు చేయకుండా హెచ్చరిస్తాడు
ఒకవేళ చేసినా క్షమ సాగరుడై క్షమిస్తాడు

- బి.కె.సత్యనారాయణ, రాంనగర్ ,సికింద్రాబాద్.

### చా ణ క్య నీ తి

**జన్మమృత్యు హియా త్యేకో భునక్త్యేకః శుభాౖ శుభమ్**
**నరకేషుపతత్యేక ఏకో యాతి పరంగతిమ్**

**మనిష ఒంటరిగానే జన్మించి ఒంటిరిగానే మరణిస్తాడు. అతడు తన కర్మయొక్క శుభాశుభ ఫలితాలను ఒంటరిగానే అనుభవిస్తాడు. చివరికి స్వర్గమునకు గాని నరకమునకుగాని ఒంటిరిగానే వెళతాడు.**



చెప్పకోండి చూద్దాం! సమాధానం: **నిమ్మకాయ**

Owner **Sist. B.K. Saroja** on behalf of Prajapita Brahma Kumaris Ishwariya Vishwa Vidyalaya, Mount Abu, Rajasthan (India)
Printed, Published and Edited by **B.K. Saroja** published from H.No.7-1-406, Opp. Monda Market, Above Central Bank, Secunderabad - 500003. Telangana (India). Phones: 040-27712444, 9676801010, E-mail: mondabk@gmail.com and printed from Premier Press, 37, Reddy Shopping Complex, Tilak Road, Abids, Hyderabad - 500 001.

























**1.రాయదుర్గ్(అనంతపురం):** 'శివచత్రఛాయాభవన్' ప్రారంభోత్సవానికి కర్ణాటకహుబ్లినుండి విచ్చేసిన బి.కె.బస్వరాజ్‌రాజర్షిగారు, వేదికపై బి.కె.యోగేశ్వరిగారు. **2.సంజీవరెడ్డినగర్ (సికింద్రాబాద్):** 18జనవరి స్మృతిదివసం సందర్భంగా శాంతిస్తంభంముందు నివాళులు అర్పిస్తూ బి.కె.కల్పనగారు, బి.కె.విద్యగారు, తదితరులు. **3.గొల్లప్రోలు(తూ॥గో):** మహాశివరాత్రి వేడుకలలోపాల్గొన్న మున్సిపల్‌చైర్మన్ మంగతాయారుగారు,బి.కె.చంద్రకళగారు,బి.కె.లక్ష్మిగారు, బి.కె.డా॥కృష్ణంరాజుగారు. **4.ద్రాక్షారామం(తూ॥గో):**ఆజాదికా అమృత్ మహోత్సవంలో బి.కె.బిందుగారు, బి.కె.చంద్రకళగారు,తదితరులు. **5.ఆర్యాపురం(రాజమండ్రి):**జాతీయరైతుదినోత్సవంసందర్భంగా ఆర్గానిక్‌రైతులసన్మాన కార్యక్రమంలో జ్యోతిప్రజ్వలనచేస్తూ బి.కె.సత్యవాణిగారు. **6.మక్తల్(మహబూబ్‌నగర్):** 'టైలర్స్‌డే' సందర్భంగా టైలర్స్‌ను సన్మానిస్తూ బి.కె.సంతోషిగారు. **7.సోమయాజులపల్లి(కర్నూలు):** మకర సంక్రాంతిరోజు ఈశ్వరీయ సందేశాన్నిస్తూ బి.కె.విజయగారు. **8.శ్రీహరిపురం(విశాఖ):** మహాశివరాత్రి వేడుకలలో జ్యోతిప్రజ్వలనచేస్తూ డా॥తిరుమలరావుగారు, డా॥నర్సింహరావు గారు, బి.కె.శివలీలగారు, బి.కె.మణిగారు, బి.కె.సింధుగారు.

POSTAL REGD. NO. H/SD/511/2018-20 RNI REGD. NO. APTEL08927/01/1/2005-TC

Date of Posting : 17th of every month
Date of Publication : 5-03-2022

1



2


3


4


5


6



7


8


**1. శాంతిసరోవర్(హైదరాబాద్):** మహాశివరాత్రి వేడుకలలో తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్‌మినిస్టర్ పువ్వాడ అజయ్‌కుమార్‌గారు, వారి సతీమణివసంతలక్ష్మీగారు, బి.వెంకటేశంగారు(ఐఏఎస్), వి.జె.రావుగారు (వైస్‌చాన్స్‌లర్‌హైదరాబాద్‌సెంట్రల్‌యూనివర్సిటీ), జిల్లాజడ్జ్ బి.వి.రావుగారు,రమాకాంత్‌ఇనానిగారు(మాజీప్రెసిడెంట్ ఎఫ్‌టిసిసి ఐ), హనుమంత్‌గారు(ఏసిపి) మరియు బి.కె.కుల్‌దీప్ బెహన్‌జీ, (కొబ్బరికాయలతో ఏర్పాటుచేసి 18అడుగులశివలింగం). **2.మోండామార్కెట్(సికింద్రాబాద్):** మహాశివరాత్రి వేడుకలలో కార్పొరేటర్ కొంతందీపికగారు, కొంతంనరేశ్‌గారు, ఎస్ఐ.మమతగారు, బి.కె.సరోజబెహన్‌జీ, బి.కె.సుజాతగారు తదితరులు.(సోమనాథ్ జ్యోతిర్లింగదర్శనం). **3. శివనగర్(వరంగల్):** మహాశివరాత్రి వేడుకలలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌గారు, గుండుసుధారాణిగారు(మేయర్ జి.డబ్ల్యు.ఎమ్.సి), కార్పొరేటర్ దిడ్డికుమార్ స్వామిగారు, బి.కె.పవితబెహన్‌జీ, బి.కె.సుధాకర్‌గారు తదితరులు. (ఇన్‌సెట్‌లో బైక్‌ర్యాలీ). **4. చెయ్యేరు(ముమ్మిడివరం, తూ॥గో):** 12వార్షికోత్సవంలో పాల్గొన్న వైసిపి నేత వడంపల్లి సూరిబాబుగారు, వేదికపై బి.కె.రజని బెహన్‌జీ, బి.కె.దిల్‌రెడ్డిగారు, బి.కె.ఉమగారు, బి.కె.దేవిగారు. **5. ఓంశాంతినగర్(కడప):** ఆజాదికా అమృత్ మహోత్సవంలో పాల్గొన్న సీనియర్‌సివిల్‌జడ్జ్ ఎస్. కవితగారు, వైవియు వైస్‌చాన్స్‌లర్ సూర్యకళావతిగారు, బిజెపి జిల్లామాజీ అధ్యక్షులు శ్రీనాథ్‌రెడ్డిగారు, వేదికపై బి.కె.గీతాబెహన్‌జీ, బి.కె.ప్రదీపగారు. **6. మహబూబ్‌నగర్:** మహాశివరాత్రి వేడుకలలో మున్సిపల్‌చైర్మన్ నర్సింహులుగారు, కౌన్సిలర్‌కృష్ణమోహన్‌గారు, బ్యాంక్‌మేనేజర్ జయరామ్‌గారు, కాటన్‌మిల్స్‌చైర్మన్ అనంతరెడ్డిగారు, బి.కె.మహదేవిబెహన్‌జీ, బి.కె.సమతగారు. **7. ఖమ్మం:** నూతనసంవత్సరవేడుకల్లో ప్రేమచంద్‌దేగ్ర (వరల్డ్‌బిల్డర్‌చాంపియన్)గారు, నిర్మల్‌దేగ్రగారు,సుమిత్రగారు, అడిషనల్ ఎస్పి సాయిబాబగారు, మౌంట్‌ఆబూనుండి విచ్చేసిన బి.కె.జగ్‌వీర్‌సింగ్‌భాయ్‌జీ, (బ్రహ్మకుమారీస్ నేషనల్ కోఆర్డినేటర్ స్పోర్ట్స్‌వింగ్), బి.కె.అజయ్‌భాయ్‌జీ, వేదికపై బి.కె.అరుణగారు, బి.కె.గీతగారు, బి.కె.దేవిగారు. **8. ఆదిలాబాద్:** మహాశివరాత్రి వేడుకలలో పాల్గొన్న మాజీ అటవిశాఖామాత్యులు, ఎమ్మెల్యే జోగురామన్నగారు, డిసిసిబి.చైర్మన్ బోజారెడ్డిగారు, మున్సిపల్‌చైర్మన్ జోగుప్రేమేందర్‌గారు, డిఎమ్‌హెచ్‌ఓ డిప్యూటి పిహెచ్‌ఓ రాథోడ్‌బాబూలాల్‌గారు, బిజెపి ప్రెసిడెంట్ సుహాసినిగారు, బి.కె.రేవతిగారు తదితరులు.